

# పల్లె వెలుగు


తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028

Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 171 పేజీలు - 08 వెల - 05/-

శుక్రవారం 19-06-2026


యోగతోనే మానసిక ఒత్తిడి దూరం: కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి



## తమిళ రాజకీయాల్లో కీలక మలుపు..

### సీఎం విజయ్‌కు దగ్గరవుతున్న వైగో!



- డీఎంకే నేతృత్వంలోని కూటమి నుంచి వైదొలగనున్న ఎండీఎంకే
- సీఎం విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వానికి దగ్గరయ్యేందుకు సన్నాహాలు
- డీఎంకే గుర్తుపై గెలవడంతో ఎమ్మెల్యేల రాజీనామా అంశంపై పార్టీలో చర్చ
- జూన్ 27న పార్టీ జనరల్ కౌన్సిల్ సమావేశంలో తుది నిర్ణయం
- విజయ్ ప్రభుత్వానికి మద్దతుగా మాట్లాడిన వైగో కుమారుడు దురై వైగో

మిగతాది 2లో

## రూ.750కే 15 లక్షల ప్రమాద బీమా

### : కేంద్ర పథకాల స్టాల్‌ను ప్రారంభించిన బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్



2లో


- పోస్టల్ శాఖ ద్వారా కేంద్రం ప్రవేశపెట్టిన స్టాల్‌ను ప్రారంభించిన మాధవ్
- ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా మోదీ వినూత్న పథకాలను ప్రారంభించారని వెల్లడి
- తక్కువ ప్రీమియంతో సామాన్యులకు లైఫ్ ఇన్స్యూరెన్స్ పథకాలు ఉన్నాయన్న మాధవ్

పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థిక భరోసా కోసం కేంద్ర ప్రభుత్వం పోస్టల్ శాఖ ద్వారా అందిస్తున్న పలు సంక్షేమ

# ఆక్వా ఫీడ్ ధరపై రైతులు తయారీదారులతో సీఎం సమావేశం

గత ప్రభుత్వంలో ఆరు సార్లు ఫీడ్ ధర పెంచినా పట్టించుకోలేదన్న రైతులు

### ఆక్వా ఫీడ్ ధరల స్థిరీకరణపై కమిటీ ఏర్పాటు



- ఫీడ్ ధర కేజీకి రూ.4 తగ్గించేందుకు కంపెనీల అంగీకారం
- ఫీడ్ ధర తగ్గింపు, విద్యుత్ రాయితీపై సీఎంకు రైతుల ధన్యవాదాలు

అమరావతి, జూన్ 18 ఆక్వా ఫీడ్ ధరల పెంపుతో గత కొన్ని రోజులుగా తలెత్తిన సమస్యకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిష్కారం చూపించారు. అటు ఆక్వా రైతులపై అధిక భారం పడకుండా, ఇటు ఫీడ్ తయారీదారులు నష్టపోకుండా ప్రస్తుత ధరపై రూ.4 తగ్గించాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. దీనికి ఫీడ్ తయారీదారులు, ఆక్వా రైతులు అంగీకరించారు. ముఖ్యమంత్రి నిర్ణయంతో ఫీడ్ ధర కేజీకి ఇప్పుడున్న ఎంఆర్పీ రూ.112 నుంచి రూ.108కి తగ్గనుంది. దీనిపై చేపలు, రొయ్యల సాగు రైతులు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. సచివాలయంలో గురువారం ఉన్నతాధికారులు, ఆక్వారైతులు, ఫీడ్ తయారీదారులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ధర తగ్గించడంతో పాటు... ఆక్వా ఫీడ్ ధర స్థిరీకరణలో భాగంగా ఆక్వా రైతులు, తయారీదారులు, అధికారులతో ఒక కమిటీ వేయాలని సీఎం ఆదేశించారు. 20 రోజుల్లోగా కమిటీ నివేదిక సమర్పించాలని, అనంతరం ధరపై తుది నిర్ణయం తీసుకుంటామని సీఎం చెప్పారు. ఫీడ్ ధరలతో పాటు, ప్రాసెసింగ్ విధానం, కాలుష్య నియంత్రణ పైనా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఫీడ్ ధరలు ఆరుసార్లు పెంచారని, మిగతాది 2లో

## డిజిటల్ బాటలో తెలంగాణ కేబినెట్..

### ఇకపై సమావేశాలు పూర్తిగా పేపర్‌లెస్

- తెలంగాణలో పేపర్‌లెస్ కేబినెట్ సమావేశాల ప్రారంభం
- మంత్రులకు ప్రత్యేక ట్యాబ్‌లు పంపిణీ చేసిన ప్రభుత్వం
- పారదర్శకత, పాలనా సామర్థ్యం పెంచడమే లక్ష్యం
- వ్యవస్థ పనితీరును స్వయంగా పరిశీలించిన సీఎం రేవంత్



తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పరిపాలనలో మరో కీలక ముందడుగు వేసింది. మంత్రివర్గ సమావేశాలను ఇకపై పూర్తిస్థాయిలో 'పేపర్‌లెస్' (కాగితరహితం)గా నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా 'తెలంగాణ డిజిటల్ కేబినెట్' విధానాన్ని లాంఛనంగా ప్రారంభించింది. గురువారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నూతన విధానానికి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు ఇతర మంత్రులకు ప్రత్యేక ట్యాబ్‌లను అందజేశారు. మిగతా 2లో

## 10 వేల మంది విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశం

### ప్రాజెక్టు ద్వారా 20 వేలకు పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన



- తిరుపతిలో జేఎస్ఎస్ మహావిద్యాపీఠం ఆఫ్-క్యాంపస్ ఏర్పాటు
- మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం

ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా కొలువుదీరిన ప్రజాప్రభుత్వంలో విద్యా రంగం అభివృద్ధికి కీలక అడుగు పడింది. ఆధ్యాత్మిక నగరమైన తిరుపతికి మరో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ రానుంది. మైసూరు కేంద్రంగా పనిచేస్తున్న జగద్గురు శ్రీ శివరాత్రీశ్వర (జేఎస్ఎస్) మహావిద్యాపీఠం, తమ ఆఫ్-క్యాంపస్‌ను తిరుపతిలో ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో అమరావతిలో ఏపీ ఉన్నత విద్యామండలి, జేఎస్ఎస్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంవోయూ) జరిగింది. ఈ ఒప్పంద పత్రాలపై ఏపీ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, జేఎస్ఎస్ మహావిద్యాపీఠం టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, మిగతాది 2లో



2లో

## నేను జైల్లో ఉన్నప్పుడు..

### బీఆర్ఎస్ ను బీజేపీలో విలీనం చేయాలనుకున్నారు: కవిత

- గులాబీ బాస్‌లపై సంచలన ఆరోపణలు చేసిన కవిత
- తాను జైల్లో ఉన్నప్పుడు కొందరు నేతలు తన వద్దకు వచ్చారన్న కవిత
- బీఆర్ఎస్ ను బీజేపీలో విలీనం చేయాలనే ప్రతిపాదనతో వచ్చారని వెల్లడి
- ఆ ప్రతిపాదనను తాను తీవ్రంగా వ్యతిరేకించానన్న కవిత
- పార్టీ కోసం ప్రాణాలు త్యాగం చేయడానికి కూడా సిద్ధపడ్డానని వెల్లడి

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ప్రకంపనలు మొదలయ్యాయి. ఇటీవల బీఆర్ఎస్ తో తెగదెంపులు

## విజయవాడ కస్టడీ డెత్: సీబీఐ విచారణ జరిపించాలి:జగన్

- విజయవాడ కస్టడీ డెత్ కేసుపై సీబీఐ విచారణకు జగన్ డిమాండ్
- మే 9 నుంచి అదృశ్యమైన యువకుడు సాయికృష్ణ
- బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వ తీరుపై విమర్శలు



విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో 25 ఏళ్ల గాదె సాయికృష్ణ అనుమానాస్పద మృతిపై సీబీఐ విచారణ జరిపించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సాయికృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఘటనను కప్పిపుచ్చేందుకు విజయవాడ పోలీస్ కమిషనర్, డీజీపీ స్థాయి అధికారులు ప్రయత్నిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు.గతంలో నేరచరిత్ర ఉన్న సాయికృష్ణను మే 9వ తేదీన మార్కాపురంలో కృష్ణలంక పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, అప్పటి నుంచి అతని ఆచూకీ తెలియలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

మిగతాది 2లో

## విప్ జారీ చేసినా ఫలితం లేదు.. ఉద్ధవ్‌కు షాక్ ఇచ్చిన ఎంపీలు!



- 9 మంది ఎంపీల్లో ముగ్గురే సమావేశానికి హాజరు
- ఢిల్లీలో నిర్వహించిన కీలక భేటీకి ఆరుగురు ఎంపీల గైర్హాజరు
- గైర్హాజరైన వారిపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంజయ్ రౌత్
- సమావేశానికి వచ్చిన వారే తమవాళ్లని వ్యాఖ్య
- మిగతావాళ్లు ద్రోహులంటూ విమర్శలు

మిగతాది 2లో

## యుద్ధంలో పొరపాట్లు జరుగుతాయి.. ఇరాన్ స్కూల్ దాడిపై ట్రంప్

- ఫిబ్రవరిలో జరిగిన దాడిలో 170 మందికి పైగా మృతి
- 100 రోజులు దాటినా కొనసాగుతున్న పెంటగాన్ దర్యాప్తు
- ఎవరూ ఉద్దేశపూర్వకంగా చేయలేదన్న ట్రంప్

ఇరాన్‌లోని పాఠశాలపై జరిగిన వైమానిక దాడి ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ-7 సదస్సులో



2

# విప్ జారీ చేసినా ఫలితం లేదు.. ఉద్ధవ్‌కు షాక్ ఇచ్చిన ఎంపీలు!

ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ)లో తిరుగుబాటు ఊహాగానాలు మరింత బలపడ్డాయి. పార్టీ విప్ జారీ చేసినప్పటికీ ఢిల్లీలో గురువారం నిర్వహించిన కీలక సమావేశానికి 9 మంది లోక్‌సభ ఎంపీల్లో కేవలం ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. దీంతో పార్టీ మరోసారి చీలిక దిశగా వెళుతోందన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరందుకుంది. పార్టీ ఎంపీల కోసం ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి అరవింద్ సావంత్, అనిల్ దేశాయ్, రాజాభౌ వాజే మాత్రమే హాజరయ్యారు. మిగిలిన ఆరుగురు ఎంపీలు దూరంగా ఉండటం కలకలం రేపింది. ఈ పరిణామం ఏక్‌నాథ్ షిండే శివసేనలో చేరికపై వస్తున్న ప్రచారానికి మరింత బలం చేకూర్చింది. సమావేశానికి ముందు హాజరైన ఎంపీల పేర్లను ప్రత్యేకంగా నమోదు చేశారు. ఈ సందర్భంగా స్పందించిన సంజయ్ రౌత్ గైర్హాజరైన ఎంపీలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సమావేశానికి వచ్చిన వారే తమవాళ్లని, రాని వాళ్లు ద్రోహులని మండిపడ్డారు. పార్టీని చీల్చేందుకు ప్రయత్నిస్తున్నవారిపై కూడా రౌత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బు, కేంద్ర దర్యాప్తు సంస్థల బెదిరింపులతో తమను భయపెట్టలేరని వ్యాఖ్యానించారు. అవసరమైతే మళ్లీ జైలుకు వెళ్లేందుకూ సిద్ధమేనని చెప్పారు. ఆరుగురు ఎంపీల మద్దతుతో ప్రత్యేక గ్రూప్‌గా గుర్తింపు కోరుతూ తిరుగుబాటు ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను సంప్రదించినట్లు బుధవారం వార్తలు వెలువడ్డాయి. పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం ప్రత్యేక గ్రూప్‌గా గుర్తింపు పొందాలంటే మూడొంతుల మద్దతు అవసరం. ప్రస్తుతం గైర్హాజరైన ఎంపీల సంఖ్య కూడా ఆ స్థాయిలో ఉండటం రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ఇప్పటివరకు ఆయా ఎంపీల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మరోవైపు ఈ వ్యవహారంపై ఏక్‌నాథ్ షిండే కూడా మౌనం పాటిస్తున్నారు. దీంతో మహారాష్ట్ర రాజకీయాల్లో తదుపరి పరిణామాలపై ఆసక్తి నెలకొంది.

# తమిళ రాజకీయాల్లో కీలక మలుపు..

తమిళనాడు రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంటోంది. సీనియర్ నేత వైగో నేతృత్వంలోని మరుమలార్చి ద్రావిడ మున్నేట్ర కజగం (ఎండీఎంకే) పార్టీ, అధికార డీఎంకే నేతృత్వంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (ఙూూ) నుంచి వైదొలగాలని దాదాపుగా నిర్ణయించుకుంది. ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ సారథ్యంలోని తమిళగ వెట్రి కజగం (టీవీకే) ప్రభుత్వానికి దగ్గరయ్యేందుకు రంగం సిద్ధమవుతోంది. ఈ నెల 27న జరగనున్న పార్టీ జనరల్ కౌన్సిల్ సమావేశంలో డీఎంకే కూటమి నుంచి బయటకు వస్తున్నట్లు ఎండీఎంకే అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే, ఈ మార్పు అంత సులువు కాదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎండీఎంకే తరఫున గెలిచిన ఇద్దరు ఎమ్మెల్యేలు, డీఎంకే 'ఉదయించే సూర్యుడు' గుర్తుపై పోటీ చేసి విజయం సాధించారు. దీంతో వారు నేరుగా విజయ్ ప్రభుత్వానికి మద్దతు ప్రకటించేందుకు సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి, ఉప ఎన్నికల్లో మళ్లీ పోటీ చేసి గెలిచిన తర్వాత టీవీకే ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలనేది ఆ పార్టీ యోచనగా కనిపిస్తోంది. గత వారం రోజులుగా చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలు ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరుస్తున్నాయి. మంగళవారం రోజున రాష్ట్ర పబ్లిక్ వర్క్స్ మంత్రి ఆధవ్ అర్జున, వైగోతో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ఆ మరుసటి రోజే, బుధవారం, వైగో స్వయంగా సచివాలయంలో ముఖ్యమంత్రి విజయ్‌తో సమావేశమయ్యారు. సుమారు 45 నిమిషాల పాటు జరిగిన ఈ భేటీ తర్వాత, పొత్తుల మార్పుపై వస్తున్న వార్తలను వైగో కొట్టిపారేసినప్పటికీ, వీరి మధ్య ప్రధానంగా రాజకీయ అంశాలే చర్చకు వచ్చినట్లు సమాచారం. మరోవైపు, వైగో కుమారుడు, తిరుచిరాపల్లి ఎంపీ అయిన దురై వైగో, విజయ్ ప్రభుత్వానికి బహిరంగంగా మద్దతు తెలుపుతూ మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న నేరాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. ఇది కేవలం ప్రభుత్వంపై వ్యతిరేకత తీసుకురావడానికి ఒక 'కథనాన్ని' సృష్టించే ప్రయత్నమని అన్నారు. గత డీఎంకే ప్రభుత్వ హయాంలోనూ ఇలాంటి ఘటనలు జరిగాయని, వాటితో పోలిస్తే ఇప్పుడు నేరాలు గణనీయంగా ఏమీ పెరగలేదని వ్యాఖ్యానించారు. డీఎంకే గుర్తుపై పోటీ చేయడం అనే 'దురదృష్టం' వల్లే తాము టీవీకే ప్రభుత్వానికి మద్దతు ఇవ్వలేకపోతున్నామని దురై వైగో ఇటీవల చేసిన వ్యాఖ్యలు కూడా చర్చనీయాంశమయ్యాయి. ఇప్పటికే డీఎంకే మాజీ మిత్రపక్షాలైన వీసీకే, ఐయూఎంఎల్, సీపీఐ, సీపీఎం వంటి పార్టీలు విజయ్ ప్రభుత్వానికి మద్దతు ప్రకటించాయి. ఇప్పుడు ఎండీఎంకే కూడా అదే బాటలో పయనించనుంది. ఏప్రిల్ అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే గుర్తుపై నాలుగు స్థానాల్లో పోటీ చేసిన ఎండీఎంకే, రెండింటిలో గెలిచింది. ఒకవేళ ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తే, తమిళనాడు అసెంబ్లీలో ఖాళీల సంఖ్య 8కి చేరుకుంటుంది. ఇందులో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విజయ్ రాజీనామా చేసిన తిరుచ్చి ఈస్ట్ స్థానం కూడా ఉంది.



# 10 వేల మంది విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశం

ఈ ఒప్పంద పత్రాలపై ఏపీ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, జేఎస్ఎస్ మహావిద్యాపీఠం టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, జేఎస్ఎస్ ఏహెచ్ఈఆర్ ప్రో ఛాన్సలర్ డా.బి.సురేష్ సంతకాలు చేసి మార్చుకున్నారు. 70 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన జేఎస్ఎస్ విద్యాసంస్థకు భారత్‌తో పాటు విదేశాల్లో 300కు పైగా విద్యాసంస్థలు ఉన్నాయి. మైసూరు కేంద్రంగా ఉన్న జేఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (జీూా ూాఙజు=), నాక్ నుంచి ూాంం గుర్తింపు పొందిన డీమ్డ్ విశ్వవిద్యాలయం. ప్రతిష్ఠాత్మక ఎన్ఐఆర్ఎఫ్ 2025 ర్యాంకింగ్స్‌లో విశ్వవిద్యాలయాల విభాగంలో 21వ స్థానంలో, ఓవరాల్‌గా 38వ స్థానంలో నిలిచి తన నాణ్యతను చాటుకుంది.

**10 వేల మంది విద్యార్థులకు అవకాశం**

ప్రతిపాదిత తిరుపతి క్యాంపస్‌ను అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దనున్నారు. ఇందులో ఐదు సమగ్ర విద్యా పాఠశాలలను ఏర్పాటు చేస్తారు. అడ్వాన్స్‌డ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీస్, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ అండ్ బిహేవియరల్ సైన్సెస్, హెల్త్‌కేర్ అండ్ అలైడ్ సైన్సెస్, మేనేజ్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ టూరిజం, లా, హ్యూమానిటీస్, పాలసీ అండ్ గవర్నెన్స్ విభాగాల్లో మొత్తం 74 కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. క్యాంపస్ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించాక, 10 వేల మందికి పైగా విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసించనున్నారు. వీటికి అదనంగా హెల్త్‌కేర్‌లో ఏఐ, సెమీకండక్టర్ అప్లికేషన్స్, హెల్త్ పాలసీ అండ్ గవర్నెన్స్, ఏరోస్పేస్ మెడిసిన్ వంటి ఆరు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ కూడా నెలకొల్పనున్నారు.

**20 వేల ఉద్యోగాలు.. స్వర్ణాంధ్ర విజన్‌కు అనుగుణంగా..** ఈ ఒప్పందం ప్రకారం, తిరుపతిలో క్యాంపస్ ఏర్పాటుకు అవసరమైన భూమి కేటాయింపు, చట్టబద్ధమైన అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం సింగిల్-విండో విధానాన్ని కల్పిస్తుంది. క్యాంపస్ నిర్మాణానికి అయ్యే మొత్తం వ్యయాన్ని జేఎస్ఎస్ మహావిద్యాపీఠమే భరిస్తుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 వేలకు పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా. ఇది స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా రాష్ట్ర యువతకు గొప్ప అవకాశాలను అందిస్తుంది. ఈ కార్యక్రమంలో జేఎస్ఎస్ ఏహెచ్ఈఆర్ రిజిస్ట్రార్ డా.బి.మంజునాథ, డీన్(రీసెర్చ్) డా. ప్రశాంత్ ఎమ్ విశ్వనాథ్, కేపీఎంపీ అడ్వైజరీ సర్వీసెస్ అసోసియేట్ డైరెక్టర్ ఎస్.రాఘవన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆక్వా ఫీడ్ ధరపై రైతులు-తయారీదారులతో సీఎం సమావేశం

గత ప్రభుత్వ హయాంలో ఫీడ్ ధరలు ఆరుసార్లు పెంచారని, అయినా నాటి ప్రభుత్వం ధర తగ్గింపుపై ఎటువంటి చొరవ తీసుకోలేదని ముఖ్యమంత్రి



చంద్రబాబుకు ఆక్వా రైతులు ఈ సందర్భంగా తెలిపారు. 2019లో కేజీ ఫీడ్ ధర రూ.87.80 ఉంటే గత ప్రభుత్వం దిగిపోయేనాటికి ఆ ధర రూ.107.80కి చేరిందని చెప్పారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఫీడ్ ధర రూ.5.80 తగ్గించిందన్నారు. తామెప్పుడూ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరించలేదని, ఇటీవల కొందరు ఆక్వా రైతుల ముసుగులో రాజకీయం చేశారని సీఎంతో అన్నారు. ఆక్వా సాగుకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే ఇస్తున్నందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఒకప్పుడు గోదావరి జిల్లాలకే పరిమితమైన ఆక్వాసాగును శ్రీకాకుళం జిల్లా నుంచి నెల్లూరు జిల్లా వరకు తీర ప్రాంతం పొడవునా విస్తరించేలా చేసిన ఘనత సీఎం చంద్రబాబుదేనని రైతులు గుర్తు చేశారు.

లిసమస్యలు విన్నవించిన రైతులులి

ప్రస్తుతం ఆక్వాసాగులో ఎదురవుతోన్న సమస్యలను ముఖ్యమంత్రితో సమావేశంలో ఆక్వా రైతులు వెల్లడించారు. సాగుకు వినియోగించే అన్ని వస్తువుల ధరలు పెరిగాయని... కానీ ఆక్వా ఉత్పత్తుల ధరలు మాత్రం పెరగడం లేదన్నారు. ముడిసరుకు ధర పెరిగినప్పుడు ఫీడ్ ధర పెంచుతున్నారు కానీ, ముడిసరుకు ధర తగ్గినప్పుడు మాత్రం ఫీడ్ ధర తగ్గించడం లేదన్నారు. దీనికితోడు ప్రాసెసింగ్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. మత్స్యశాఖ నుంచి రైతులకు అందించే రాయితీలపైనా అందరికీ అవగాహన కల్పించాలని రైతులు కోరారు. రాయితీలకు సంబంధించి నిర్దేశించిన ఎంప్యానెల్ విషయంలో మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రొయ్యల చెరువులకు బీమా సౌకర్యాన్ని విస్తృత పరిచేలా చూడటంతో పాటు, నర్సరీ పాండ్స్ ఏర్పాటుకు ప్రోత్సాహం అందించాలన్నారు. అలాగే చేపలు, రొయ్యల చెరువులకు నీటి వనరులు అందించాలని రైతులు చేసిన విజ్ఞప్తికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. నీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బంది లేదన్నారు.

**లిసోయా ధర పెరిగిందన్న ఫీడ్ కంపెనీల ప్రతినిధులులి**

సోయా, ఫిష్ మీల్ వంటి ముడిసరుకు కొరత ఉందని, దేశీయంగా వీటి ధర కూడా అధికంగా ఉందని ఫీడ్ కంపెనీల ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. ధర తక్కువగా ఉన్న అమెరికా నుంచి సోయా దిగుమతులకు అనుమతి లేకపోవడంతో దేశీయ మార్కెట్లో రెట్టింపు ధరకు కొంటున్నామన్నారు. దీంతో ధరలు పెంచాల్సి వచ్చిందని వివరించారు. వాస్తవంగా రూ.20 ధర పెంచాల్సి ఉన్నప్పటికీ...రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ధర పెంపును రూ.12కి పరిమితం చేశామని చెప్పారు.

లిఆక్వా రైతులకు రూ.1,543 కోట్ల విద్యుత్ రాయితీలి

లక్షలాది మంది ఆధారపడిన ఆక్వారంగాన్ని పరిరక్షించే బాధ్యత కూటమి ప్రభుత్వానికి ఉందని, ఈ రెండేళ్లలో రూ.1,543 కోట్ల మేర విద్యుత్ రాయితీ రూపంలో ఆక్వాసాగుకు ఇచ్చామని సీఎం అన్నారు. ఇప్పుడు కంపెనీలు ఫీడ్ ధరల పెంచడంతో జోక్యం చేసుకున్నామని సీఎం చెప్పారు. ధరల సమస్య పరిష్కారానికి అందరూ చిత్తశుద్ధితో పనిచేయాలని... అప్పుడే ఇద్దరికీ లబ్ధి కలుగుతుందన్నారు. రైతులు కూడా ఉత్పత్తి వ్యయం తగ్గించుకునేందుకు ఆలోచన చేయాలన్నారు. చేపలు, రొయ్యల రైతులు ఇద్దరికీ తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ప్రభుత్వం ఇస్తున్న మద్దతును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతు సంఘాలు సమావేశాలు నిర్వహించుకుని సమస్యలకు పరిష్కారాలు వెతకాలని సీఎం చెప్పారు. ఆక్వారంగాన్ని ఆధునీకరించేలా, సాంకేతిక వినియోగం పెరిగేలా చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజల ఆహారపు అలవాట్లు మారాయని, ఆక్వా ఉత్పత్తులకు మరింత డిమాండ్ పెరిగిందని దీనిని వినియోగించుకోవాలన్నారు. అమెరికా ఆంక్షలతో వేరే దేశాలకు మార్కెట్ విస్తరించేలా చేశామని చెప్పారు. నాణ్యత, సర్టిఫికేషన్ విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మిరప పంటకు పురుగుమందులు వినియోగించడంతో ఇటీవల ఎగుమతులను చైనా తిరస్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు, ఏపీ ఆక్వా కల్చర్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# యుద్ధంలో పొరపాట్లు జరుగుతాయి..
# ఇరాన్ స్కూల్ దాడిపై ట్రంప్

ఇరాన్‌లోని పాఠశాలపై జరిగిన వైమానిక దాడి ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ-7 సదస్సులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. యుద్ధంలో ఇటువంటి "పొరపాట్లు జరుగుతుంటాయని", దీనిని ఎవరూ "ఉద్దేశపూర్వకంగా చేయలేదని" వ్యాఖ్యానించారు. అయితే, ఈ ఘటనకు గల బాధ్యతపై అడిగిన ప్రశ్నకు ఆయన నేరుగా సమాధానం ఇవ్వకుండా దాటవేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న దక్షిణ ఇరాన్‌లోని మినాబ్‌లో ఉన్న షజారా తయ్యేబే ప్రాథమిక పాఠశాలపై జరిగిన వైమానిక దాడిలో 170 మందికి పైగా మరణించారు. వీరిలో అత్యధికులు చిన్నారులే కావడం గమనార్హం. ఈ దారుణం జరిగి 100 రోజులు గడిచినప్పటికీ, దీనిపై పెంటగాన్ దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని ట్రంప్ వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సెత్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త సైనిక చర్యలు ప్రారంభమైన మొదటి రోజే ఈ దాడి చోటుచేసుకుంది. పాత నిఘా సమాచారం ఆధారంగా అమెరికా ప్రయోగించిన టోమాహాక్ క్షిపణి, పొరపాటున పాఠశాలపై పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. అయితే, ఘటన జరిగిన తొలినాళ్లలో ఇరాన్ ఆయుధాల వైఫల్యం వల్లే ఈ ఘోరం జరిగిందని ట్రంప్ ఆరోపించారు. కానీ, అక్కడ అమెరికా క్షిపణి అవశేషాలు లభించడంతో ఆ వాదన తప్పని స్పష్టమైంది. దాడికి ఎవరు బాధ్యత వహిస్తారనే ప్రశ్నను ట్రంప్ 'వింతైనది'గా అభివర్ణించారు. "యుద్ధం అనేది చాలా క్రూరంగా ఉంటుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై పారదర్శక విచారణ జరిపి, బాధ్యులను శిక్షించాలని అమెరికా సెనేట్‌లోని సభ్యులు, మానవ హక్కుల సంఘాలు తీవ్ర ఒత్తిడి తెస్తున్నాయి. అయినప్పటికీ, జీ-7 సదస్సులో దర్యాప్తు పురోగతికి సంబంధించి ట్రంప్ ఎలాంటి కొత్త వివరాలను వెల్లడించలేదు.

# రూ.750కే 15 లక్షల ప్రమాద బీమా

పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థిక భరోసా కోసం కేంద్ర ప్రభుత్వం పోస్టల్ శాఖ ద్వారా అందిస్తున్న పలు సంక్షేమ పథకాలపై బీజేపీ ఏపీ శ్రేణులు స్పెషల్ డ్రైవ్ చేపట్టాయి. ఇందులో భాగంగా ఈరోజు తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో పర్యటించిన బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్... పోస్టల్ శాఖ ద్వారా కేంద్రం ప్రవేశపెట్టిన పథకాల ప్రత్యేక నమోదు స్టాల్‌ను అధికారికంగా ప్రారంభించారు. రూ.750లకే 15 లక్షల ప్రమాద బీమా: ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ... పేద, మధ్యతరగతి వర్గాల సంక్షేమం కోసం ప్రపంచంలో మరెక్కడా లేని విధంగా ప్రధానమంత్రి మోదీ అనేక వినూత్న పథకాలను ప్రవేశపెట్టారని కొనియాడారు. చౌకగా, అతి తక్కువ ప్రీమియంతో సామాన్యులకు కూడా అందుబాటులో ఉండేలా లైఫ్ ఇన్సూరెన్స్ (జీవిత బీమా) పథకాలను కేంద్రం అమలు చేస్తోందన్నారు. కేవలం రూ. 750 చెల్లిస్తే చాలు.. ఏకంగా రూ. 15 లక్షల ప్రమాద బీమా సదుపాయం లభిస్తుందని వివరించారు. అలాగే పోస్టల్ ఆఫీసుల ద్వారా మరెక్కడా లేనంత అత్యధిక వడ్డీ ఇచ్చే పలు పొదుపు పథకాలను మోదీ ప్రభుత్వం సమర్థంగా చేపడుతోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ లబ్ధిని ప్రజల ముంగిటకే తీసుకెళ్లేందుకు తాము ప్లాన్ చేస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు తెలిపారు. ఈ స్కీమ్స్‌లో ప్రజలు సులభంగా చేరేందుకు వీలుగా అన్ని నగరాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యాన్ని సాధించడమే మోదీ ప్రభుత్వ ధ్యేయమని, ఈ దేశాభివృద్ధి యజ్ఞంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మాధవ్ పిలుపునిచ్చారు.

# నేను జైల్లో ఉన్నప్పుడు..
## బీఆర్ఎస్ ను బీజేపీలో విలీనం చేయాలనుకున్నారు: కవిత

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ప్రకంపనలు మొదలయ్యాయి. ఇటీవల బీఆర్ఎస్ తో తెగదెంపులు చేసుకుని, సొంతంగా తెలంగాణ రక్షణ సేన పేరుతో పార్టీని ఏర్పాటు చేసిన కల్వకుంట్ల కవిత.. గులాబీ బాస్‌లపై సంచలన ఆరోపణలు చేశారు. ఒక ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం బీఆర్ఎస్ అనే పార్టీ మనుగడలో ఉందంటే దానికి కారణం తానేనని స్పష్టం చేశారు. తాను ఢిల్లీ లిక్కర్ కేసులో జైల్లో ఉన్న సమయంలో.. బీఆర్ఎస్ పార్టీని తీసుకెళ్లి బీజేపీలో విలీనం చేయాలనే ప్రతిపాదనతో కొంతమంది నేతలు తన వద్దకు వచ్చారని కవిత వెల్లడించారు. ఆ ప్రతిపాదన వినగానే తాను తీవ్రంగా వ్యతిరేకించానని, విలీనానికి అస్సలు ఒప్పుకోకుండా స్ట్రాంగ్‌గా నిలబడ్డానని కవిత చెప్పారు. "నేనేం తప్పు చేయలేదు.. ఏదో ఒకరోజు బెయిల్‌పై కచ్చితంగా బయటకు వస్తాను, అంతవరకు పార్టీని వేరే పార్టీకి త్యాగం చేయవద్దని వారితో చెప్పాను. పార్టీ మనుగడ కోసం జైల్లో నా ప్రాణాలను సైతం త్యాగం చేయడానికి సిద్ధపడ్డాను" అని కవిత వివరించారు. ఇవాళ జైలు నుంచి బయటకు వచ్చాక కొందరు బీఆర్ఎస్ నేతలు టీవీల్లో కూర్చుని ఏది పడితే అది మాట్లాడుతున్నారని కవిత మండిపడ్డారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి తానే కారణమంటూ వస్తున్న ఆరోపణలను ఆమె పూర్తిగా ఖండించారు. ఎన్నికల సమయంలో చర్చ అంతా కేవలం ప్రభుత్వ వైఫల్యాల గురించే జరిగిందని, కానీ ఆ చేదు నిజాన్ని అంగీకరించడానికి బీఆర్ఎస్ నాయకత్వం ఇప్పటికీ సిద్ధంగా లేదని ఎద్దేవా చేశారు. పార్టీలో తాను తీవ్రమైన పక్షపాతాన్ని, అవమానాన్ని చవిచూశానని కవిత ఆవేదన వ్యక్తం చేశారు.

# డిజిటల్ బాటలో తెలంగాణ కేబినెట్..

ఈ కొత్త విధానంలో భాగంగా, కేబినెట్ సమావేశాలకు సంబంధించిన అజెండా, నోట్స్ మరియు ఇతర అధికారిక పత్రాలను ముద్రించిన ఫైళ్ల రూపంలో కాకుండా డిజిటల్‌గా ట్యాబ్‌ల ద్వారానే అందుబాటులో ఉంచుతారు. ఈ వ్యవస్థ పనితీరును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. పరిపాలనలో సామర్థ్యం, పారదర్శకత, సుస్థిరతను పెంపొందించడంతో పాటు కాగితం వాడకాన్ని తగ్గించడమే ఈ విధానం యొక్క ప్రధాన ఉద్దేశం. కాగా, ఈ సమావేశంలో కార్యదర్శులు లేదా ఇతర అధికారులు పాల్గొనలేదు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ఆగస్టు 2024లో ఈ-కేబినెట్ విధానాన్ని అమలు చేసిన దాదాపు రెండేళ్ల తర్వాత తెలంగాణ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. గతంలో 2014-19 మధ్య కాలంలో చంద్రబాబు నాయుడు హయాంలో ఆంధ్రప్రదేశ్‌లో పేపర్‌లెస్ సమావేశాలు నిర్వహించగా, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దానిని నిలిపివేసింది. అనంతరం మరింత ఆధునిక వెర్షన్‌తో ఆ విధానాన్ని అక్కడ పునఃప్రారంభించారు. జాతీయ సమాచార కేంద్రం (చీ×జ) సహకారంతో ఈ-గవర్నెన్స్‌ను బలోపేతం చేయడంలో భాగంగా ఈ డిజిటల్ కేబినెట్‌ను ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాధికార ప్రక్రియ మరింత వేగవంతం మరియు సులభతరం అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

# విజయవాడ కస్టడీ డెత్:
# సీబీఐ విచారణ జరిపించాలి: వై.ఎస్. జగన్

తన కుమారుడిని పోలీసులు అక్రమంగా నిర్బంధించి చిత్రహింసలకు గురిచేశారని అతని తల్లి విజయలక్ష్మి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే, తాము సాయికృష్ణను అదుపులోకి తీసుకోలేదని, అతని కోసం గాలిస్తున్నామని పోలీసులు కోర్టుకు విన్నవించారు. ఈ కేసుపై విచారణ చేపట్టిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, పోలీసుల వాదనలపై సందేహాలు వ్యక్తం చేసింది. జూన్ 29లోగా సాయికృష్ణను కోర్టు ముందు హాజరుపరచాలని, లేనిపక్షంలో సంబంధిత అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించింది. ఈ పరిణామాల నేపథ్యంలో, ప్రభుత్వం కృష్ణలంక సీఐ నాగరాజును సస్పెండ్ చేసి, ఒక సీనియర్ ఐపీఎస్ అధికారితో ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై తక్షణమే హత్య కేసు నమోదు చేయాలని జగన్ డిమాండ్ చేశారు. టీడీపీ ప్రభుత్వం ఈ విషయాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తోందని ఆయన విమర్శించారు.

# జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య కల్పించాలి

- ఏపీడబ్ల్యూజేఎఫ్ వినతిపత్రం అందజేస్తున్న
- ఏపీడబ్ల్యూజేఎఫ్ తాలూకా కమిటీ నాయకులు



ఎమ్మిగనూరు పల్లె వెలుగు జూన్ 18 రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) గౌరవ అధ్యక్షులు వి దేవేంద్ర మూర్తి, గిప్సన్, తాలూకా అధ్యక్షులు షబ్బీర్, కార్యదర్శి నాగరాజ్ నాయుడు డిమాండ్ చేశారు. గురువారం ఏపీడబ్ల్యూజేఎఫ్ తాలూకా కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు మండల విద్యాధికారి ఆంజనేయులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రజలకు సమాచారాన్ని చేరవేసే బాధ్యతాయుతమైన వృత్తిలో పనిచేస్తున్నప్పటికీ, వారి పిల్లల విద్యాభారం రోజురోజుకూ పెరుగుతోందని నాయకులు పేర్కొన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు కనీసం 50 శాతం సీట్లను ఉచితంగా కేటాయించాలని కోరారు.రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, వారి పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ డిమాండ్‌పై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ తాలూకా కమిటీ నాయకులు నరసింహులు, సోహెల్, సునీల్, రెహమాన్, సురేంద్ర, మురళి, మోషా, రాజు, విజయ్, లతీఫ్, ఖాదర్, బేగ్ రుక్మాన్, ఈరన్న, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

# కస్తూరిబ,బాలికలకు రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు

దొర్నిపాడు జూన్ 18 పల్లె వెలుగు న్యూస్ దొర్నిపాడు మండలంలోని అమ్మిరెడ్డి



నగరంగ్రామంలో గల కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నంద్యాలవారిఆధ్వర్యంలో సొసైటీ చైర్మన్ పర్ల దస్తగిరి ఆదేశాల మేరకు బాలికలకు ఉచితంగా రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షను గురువారం ఎస్ఓ జయమణి ఆధ్వర్యంలో నిర్వహించారు, ఈ సందర్భంగా ఎస్ఓ, జయమణి,రెడ్ క్రాస్ సొసైటీ దొర్నిపాడు మండలం నిర్వాహకుడు ఆర్ఎంపి వైద్యుడు నాగేంద్ర మాట్లాడుతూ విద్యార్థులు రక్త గ్రూపు తెలుసుకోవడం వలన అత్యవసర సమయాలలో మీకు మీకుటుంబానికేకాకుండావేరే వ్యక్తులుఎవరైనా గాయాలపాలై ప్రాణాపాయ స్థితిలో ఉంటే రక్తం దానం చేయడానికి వీలుంటుంది అన్నారు,రక్త హీనతపై ,రక్తదానంపై బాలికలకు అవగాహన కల్పించారు,వేరొకరికి రక్తదానం చేసి జీవితాన్ని పంచండి వారిలో ఆశను నింపండి,అదేవిధంగా రక్త గ్రూపుతెలుసుకోండి ప్రాణదాతలుకండి మీరిచ్చే ఒక యూనిట్ రక్తం ముగ్గురు ప్రాణాలను కాపాడగలరు మానవత్వమే మన ధర్మం రక్తదానం మహాదానం అన్నారు రక్తహీనతను జయించడానికి మంచి పోషకాహారంతీసుకొని ఆరోగ్య వంతులుగా ఉండాలని బలంగా ఎదగాలని బాలికలకు సూచించారు, ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ల్యాబ్ టెక్నీషియన్ రామ్మోహన్ విద్యార్థినులు పాల్గొన్నారు

# మరువలేని సేవలు అందించిన జయలక్ష్మి



మహానంది, పల్లె వెలుగు వ్యవసాయ రంగానికి అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి మరువలేని సేవలు అందించారని పశు సంవర్ధక పరిశోధన స్థానం డాక్టర్ ఎల్. ధర్మారావు పేర్కొన్నారు. గురువారం మహానంది ఫారంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్‌గా డాక్టర్ జయలక్ష్మి విధులు నిర్వహిస్తూ..అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్‌గా పదోన్నతి పోంది బదిలీపై వెళ్తున్నా ఆమెను ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ.. జయలక్ష్మి నాయకత్వంలో కళాశాలలో చేపట్టిన విద్యా, పరిశోధన,విస్తరణ కార్యక్రమాలు విశేష ఫలితాలను సాధించాయని పేర్కొన్నారు.ఆమె నూతన బాధ్యతల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇదేం ప్రజాస్వామ్యం? ఓటర్ల సవరణ పార్టీ ఆఫీసుల్లోనా?.

## ప్రత్యేక ఓటర్ల సవరణ బూత్ పరిధిలోనా? అధికార పార్టీ కార్యాలయంలోనా?



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. భారత ఎన్నికల కమిషన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియ నంద్యాలలో అపహాస్యంగా మారింది. నంద్యాల పట్టణం విశ్వ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో సంబంధిత బీఎల్ఓ కూర్చొని ఓటర్ల జాబితాను పరిశీలిస్తుండటం పట్ల స్థానిక ఓటర్లలో తీవ్ర వ్యతిరేకత, సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పోలింగ్ బూత్ పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ప్రభుత్వ అధికారి, రాజకీయ పార్టీ ఆఫీసులో ఎందుకున్నారు? ఇలాంటి చర్యల వల్ల ప్రతిపక్ష మద్దతుదారుల ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం లేదా? ఎన్నికల కమిషన్ నిబంధనలను ఇంత బహిరంగంగా ఉల్లంఘిస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారు? అధికార పార్టీకి కొమ్ము కాస్తున్న ఇలాంటి బీఎల్ఓలపై ఉన్నతాధికారులు వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. ఓటర్ల సవరణ ప్రక్రియను సజావుగా, సవ్యంగా, పారదర్శకంగా నిర్వహించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి.

"ప్రజాస్వామ్యం పహాస్యం అవుతోంది! ఎన్నికల కమిషన్ నిబంధనలు గాల్లో కలిసిపోతున్నాయి!"

"నంద్యాల పట్టణం విశ్వ నగర్‌లో బూత్ లెవెల్‌లో జరగాల్సిన ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియ... ఏకంగా అధికార టీడీపీ పార్టీ కార్యాలయంలో జరుగుతోంది." సదరు బీఎల్ఓ అధికార పార్టీకి కొమ్ముకాస్తూ, అక్కడ కూర్చొని జాబితాలు పరిశీలించడంపై స్థానిక ఓటర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాగైతే సామాన్యుల ఓట్లు గల్లంతేనా అని ప్రశ్నిస్తున్నారు." దీనిపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సదరు బీఎల్ఓపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు."

# రాష్ట్ర ముస్లిం రచయితల సంఘం ప్రధానకార్యదర్శిగా ఎన్నికైన నంద్యాల అబ్దుల్ సమద్.



పల్లె వెలుగు నంద్యాల రూరల్. రాష్ట్ర ముస్లిం రచయితల సంఘం (రిజిస్టర్ నెం 238/2023)కార్యవర్గ సమావేశంలో నంద్యాల రచయిత షేక్ అబ్దుల్ సమద్ ను ప్రధాన కార్యదర్శి గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముస్లిం రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు ప్రముఖ కవి కరీముల్లా అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధ్యక్షులుగా గుంటూరుకు చెందిన అబ్దుల్ హాకీం, ప్రధాన కార్యదర్శిగా నంద్యాలకు చెందిన అబ్దుల్ సమద్, ఉపాధ్యక్షులుగా మండపేటకు చెందిన ముహమ్మద్ షరీఫ్, సహాయం కార్యదర్శిగా ఈవేమనా రఫీ, కోశాధికారిగా బషీర్ అహమ్మద్, మహిళా కార్యదర్శులుగా బషీరున్నిసా బేగం, ఖుర్షీద్ బేగం, నసీమా బేగం, కార్యదర్శులుగా యస్. యం. సుభాని, ఉమర్ ఫారూఖ్ ఖాన్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని కార్యదర్శి అబ్దుల్ సమద్ మాట్లాడుతూ ముస్లిం విద్యాభివృద్ధికి, సామిజక చైతన్యానికి, మతసామరస్యానికి, లౌకిక విలువల పరిరక్షణకు, తెలుగు భాషాభివృద్ధికి, రాజ్యాంగ విలువలు కట్టుబడి "మురసం" పని చేస్తుందని కార్యవర్గం ప్రతిన చేసినట్లు తెలిపారు. ఇప్పటికే పలు జిల్లాల్లో జిల్లా శాఖలు ఉన్నాయని, లేని చోట జిల్లా కన్వీనర్లు, కార్యవర్గ ఎన్నిక నిర్వహించనున్నట్లు సమద్ ప్రకటించారు. వివిధ సందర్భాలను బట్టి కవిసమ్మేళనాలు,కవిత్వం,కథ, వ్యాసాలు పై శిక్షణ తరగతులు, సెమినార్లు నిర్వహిస్తామని తెలిపారు. త్వరలో రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అన్ని ప్రగతిశీల, లౌకిక, దళిత, బహుజన సాహితి శిబిరాలకు తమ సంఘీభావం ఉంటుందని , మురసం అన్ని రకాల మతోన్మాదాలను, మత ఉగ్రవాదాలను వ్యతిరేకిస్తుందని, దేశ సమైక్యతకు కృషి చేస్తుదని మురసం భవిష్యత్తు కార్యక్రమాలు ప్రకటించారు. త్వరలో జాతీయ అధ్యక్షులు కరీముల్లా, అధ్యక్షులు అబ్దుల్ హాకీం , ప్రధాన కార్యదర్శులు అన్ని జిల్లాలు ప్రర్యటించనున్నట్లు సమద్ తెలిపారు.

# ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలి.

- ప్రతి అర్హుడైన ఓటరు జాబితాలో నమోదు కావాలి.
- బీఎల్ఓలు ఎన్యుమరేషన్ ఫారాలను స్వయంగా బీఎల్ఓ యాప్‌లో నమోదు చేయాలి.
- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా గురువారం సిరివెళ్ల మండలంలోని గోవిందపల్లి గ్రామాన్ని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని స్వర్ణగ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. సచివాలయ పరిధిలో పనిచేస్తున్న బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓలు) నిర్వహిస్తున్న పనితీరు, వారి సంఖ్య, రోజువారీగా స్వీకరిస్తున్న దరఖాస్తులు, వాటి పరిష్కార స్థితి, ఇప్పటివరకు నమోదైన చేర్పులు, తొలగింపులు, మార్పుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవెల్ ఏజెంట్లు (బీఎల్ఏలు)తో సమావేశమై ప్రత్యేక సవరణ కార్యక్రమంపై వారి అభిప్రాయాలు, సూచనలు తెలుసుకున్నారు. ప్రతి అర్హుడైన ఓటరు ఓటర్ల జాబితాలో నమోదయ్యేలా చర్యలు చేపట్టాలని, ఎలాంటి ఫిర్యాదులకు తావు లేకుండా కార్యక్రమాన్ని సమగ్రంగా అమలు చేయాలని సూచించారు. జిల్లాలో ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ధృవీకరణ అనంతరం ఎన్యుమరేషన్ ఫారాలను స్వయంగా బీఎల్ఓ యాప్‌లో నమోదు చేసి పూర్తి చేయాలని సూచించారు. వివరాల నమోదు సమయంలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా అత్యంత జాగ్రత్తతో వ్యవహరించాలని, ప్రతి అర్హ ఓటరుకు సంబంధించిన సమాచారం ఖచ్చితంగా నమోదు కావాలని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా నాణ్యతను మెరుగుపరచడం, పారదర్శకతను పెంపొందించడం లక్ష్యంగా ప్రతి ఎన్యుమరేషన్ ఫారాన్ని క్షుణ్ణంగా పరిశీలించి యాప్‌లో నవీకరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రత్యేక సవరణ కార్యక్రమం విజయవంతం కావడానికి రాజకీయ పార్టీలు, బీఎల్ఏలు, బీఎల్ఓలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.



# గౌరు దంపతులను మర్యాదపూర్వకంగా కలిసిన కర్నూలు డీఎస్పీ రాఘవేంద్ర



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కర్నూలు డీఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కె.వి. రాఘవేంద్ర గురువారం మాధవి నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాణ్యం నియోజకవర్గం శాసనసభ్యురాలు, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గౌరు చరిత రెడ్డిని, అలాగే టీడీపీ సీనియర్ నాయకులు, నందికొట్కూరు నియోజకవర్గం ఇన్చార్జి గౌరు వెంకట రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా గౌరు దంపతులకు డీఎస్పీ రాఘవేంద్ర పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల సమస్యల పరిష్కారం తదితర అంశాలపై వారు కాసేపు చర్చించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన డీఎస్పీకి గౌరు చరిత రెడ్డి, వెంకట రెడ్డి దంపతులు అభినందనలు తెలియజేస్తూ, విధి నిర్వహణలో విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి..

### హోంగార్డులకు ప్రమాదబీమా సౌకర్యంపై యాక్సిస్ బ్యాంక్ ప్రతినిధులతో అవగాహన.

**ప్రజలకు మెరుగైన సేవలు అందించి మన్ననలు పొందండి.**



పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఆదేశాలమేరకు నేటి ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలోని మైదానంలో హోంగార్డ్స్ పెరేడ్ మరియు దర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 60 మంది హోంగార్డులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హోంగార్డ్స్ కమాండెంట్ .మహేష్ కుమార్ హోంగార్డ్ కవాతును పరిశీలించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ హోంగార్డ్ సంక్షేమానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, ప్రతి సంవత్సరం హోంగార్డులకు మరియు వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య పరీక్షలు చేయించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని దాని వలన కలిగే ఉపయోగాలను గురించి తెలియజేశారు. మరియు హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు , వాటి ప్రయోజనాలు , ఆరోగ్య భద్రత కోసం బీమా ప్రాముఖ్యతపై యాక్సిస్ బ్యాంక్ ప్రతినిధులతో హోంగార్డులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతోపాటు నంద్యాల జిల్లాకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకొని వచ్చే విధంగా అందరూ కృషి చేయాలని ఆకాంక్షించారు.
అనంతరం ఉత్తమ ప్రతిభ కనపరచిన హోంగార్డులకు ప్రశంసా పత్రాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కమాండెంట్ తో పాటు జిల్లా సాయుధ బలగాల అడిషనల్ ఎస్పి బి. చిన్ని కృష్ణ , కడ్పడీఎస్పీ శ్రీనివాసులు , హోంగార్డ్ డి.ఎస్.పి ప్రసాద్ , రిజర్వ్ ఇన్స్పెక్టర్లు బాబు , విజయ్ లు, ఆర్ ఎస్ ఐ లు హర్షవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.





# 38 వార్డ్ వై.ఎస్.ఆర్ నగర్ లో రోడ్లు, డ్రైనేజీ పనులకు భూమిపూజ చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల టౌన్ 38 వార్డ్ వై.ఎస్.ఆర్ నగర్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు . ఈ మేరకు వార్డులో రోడ్లు మరియు డ్రైనేజీ





కాల్వల నిర్మాణ పనులకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ హాజరై భూమి పూజ చేశారు . ఈ సందర్భంగా ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ "ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం అన్నారు. వై.ఎస్.ఆర్ నగర్ అభివృద్ధికి టి.డి.పి. కట్టుబడి ఉందని , ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఎటువంటి రాజీ పడబోమని తెలిపారు . ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ , 38వ వార్డు ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు, మహేష్ బాబు, హిమామ్ హుస్సేన్, నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న , టీడీపీ నాయకులు వడ్డే నాగేంద్ర, మరాఠీ సూరి ,చిన్న రాముడు, సౌభాగ్యవతి, యాలిశా, హుసాన్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

# రెండేళ్ల కూటమి పాలనలో పాణ్యం ప్రగతిపథం: ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

- అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం సమ ప్రాధాన్యం
- ఘనంగా 'రెండేళ్ల నమ్మకం' నియోజకవర్గ స్థాయి సమావేశం



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్ల కాలంలో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనకు సమ ప్రాధాన్యత ఇచ్చిందని పాణ్యం నియోజకవర్గ శాసనసభ్యురాలు, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గౌరు చరిత రెడ్డి అన్నారు. గురువారం కర్నూలు పట్టణంలోని ఏఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆమె అధ్యక్షతన "రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం" అనే అంశంపై పాణ్యం నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల కల్పన వల్ల పాణ్యం నియోజకవర్గం అన్ని రంగాల్లోనూ వేగంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి నాయకులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గౌరు వెంకటరెడ్డి, యువ నాయకులు గౌరు జనార్ధన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చింతా సురేష్ బాబు, బీజేపీ నియోజకవర్గ అధ్యక్షుడు మద్దిలేటి రెడ్డి, పాణ్యం నియోజకవర్గ పరిశీలకులు ప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారితో పాటు పలువురు కార్పొరేషన్ డైరెక్టర్లు, నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కూటమి అనుబంధ విభాగాల నాయకులు మరియు పెద్ద సంఖ్యలో పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

# పీర్ల పండుగను పర్యావరణ హితంగా జరుపుకుందాం

### అటవీశాఖ అధికారుల పిలుపు



హోళగుంద పల్లె వెలుగు జూన్ 18 మొహర్రం పండుగ సందర్భంగా పచ్చని చెట్లను నరకకుండా పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ సి. విజయ్ భాస్కర్ రెడ్డి గ్రామస్థులకు సూచించారు. హొళగుంద మండలం గజ్జెహల్లి గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అధికారులు ప్రజలకు చెట్ల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, పీర్ల పండుగలో గుండాలు తయారు చేసే పేరుతో వేప, మర్రి, రావి, జమ్మి, చింత వంటి పచ్చని చెట్లను నరకడం చట్టవిరుద్ధమని తెలిపారు. అనుమతి లేకుండా చెట్లు నరికితే ఏపీ వాల్టా చట్టం--2002, ఇండియన్ ఫారెస్ట్ యాక్ట్--1927 ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండుగ అవసరాల కోసం ఎండిన చెట్లు, యూకలిప్టస్ మొద్దులు, తుమ్మ కొమ్మలను మాత్రమే వినియోగించాలని సూచించారు. చెట్లు మన జీవనాధారమని, పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. చెట్ల నరికివేత వల్ల వర్షపాతం తగ్గి భవిష్యత్‌లో కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ చెట్లను సంరక్షిస్తూ పండుగలను పర్యావరణ హితంగా జరుపుకోవాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు సి. సమిల్లా, ఎ. నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# యోగతోనే మానసిక ఒత్తిడి దూరం: కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి

- **ఆరోగ్య సంరక్షణకు ప్రతి ఒక్కరూ యోగాను అలవర్చుకోవాలి**
- **కర్నూలు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు భాగస్వాములు కావాలి**
- **ఘనంగా పారిశుద్ధ్య కార్మికుల 'థీమాటిక్ యోగా' కార్యక్రమం**
- **పాల్గొన్న ఎమ్మెల్యే గౌరు చరిత, జేసీ నూరుల్ ఖమర్**

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో



ప్రస్తుత యాంత్రిక జీవనంలో ప్రతి ఒక్కరూ ఒత్తిడికి గురవుతున్నారని, ఆ ఒత్తిడిని తగ్గించుకుని మనస్సును ప్రశాంతంగా, ఆరోగ్యంగా ఉంచుకోవడానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని కర్నూలు జిల్లా కలెక్టర్, మున్సిపల్ కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ ఏ.సిరి పేర్కొన్నారు. గురువారం కర్నూలులోని ఎస్ఏపీ క్యాంప్ ఆవరణలో పారిశుద్ధ్య కార్మికుల కోసం నిర్వహించిన 'థీమాటిక్ యోగా' కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సంయుక్త సమావేశంలో పాణ్యం శాసనసభ్యురాలు గౌరు చరిత రెడ్డి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ కూడా పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాకు విశేష ప్రాధాన్యతనిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాయని తెలిపారు. యోగా సాధన వల్ల రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్) వంటి దీర్ఘకాలిక వ్యాధులు అదుపులో ఉంటాయని వివరించారు. నేటి కాలంలో ఒత్తిడి కారణంగా సంతానలేమి సమస్యలు పెరిగి ఫర్టిలిటీ సెంటర్లు వెలుస్తున్నాయని, పూర్వీకులకు యోగా, శారీరక శ్రమ వల్ల ఇలాంటి అవసరాలు రాలేదని గుర్తుచేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని ఓర్వకల్లు రాక్ గార్డెన్స్, కొండారెడ్డి బురుజుతో పాటు పలు ప్రముఖ ఆలయాల్లో యోగా ప్రదర్శనలు నిర్వహించినట్లు తెలిపారు.

కార్మికుల సేవలు అమోఘం.. రక్షణ చర్యలు తప్పనిసరి: నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలను కలెక్టర్ కొనియాడారు. ప్రమాదకర పరిసరాల్లో పనిచేసేటప్పుడు కార్మికులు తప్పనిసరిగా గ్లౌజులు, రక్షణ దుస్తులు ధరించాలని సూచించారు. ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరిస్తూ చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా నగరాన్ని క్లీన్‌గా ఉంచేందుకు మున్సిపాలిటీకి సహకరించాలని పిలుపునిచ్చారు. అలాగే విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి యోగా పోటీలకు జిల్లా నుంచి వెళ్లిన అభ్యర్థులు పతకాలు సాధిస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

యోగాతో శారీరక, మానసిక దృఢత్వం: ఎమ్మెల్యే గౌరు చరిత పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యమని, అన్ని సమస్యలను తట్టుకునే మానసిక స్థైర్యాన్ని యోగా అందిస్తుందని చెప్పారు. పారిశుద్ధ్య కార్మికులు తమ నిత్య జీవితంలోని మానసిక ఇబ్బందులను దూరం చేసుకోవడానికి రోజూ ఒక గంట యోగా చేయాలన్నారు. కేవలం సొంత ఇల్లే కాకుండా పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రతి మూడో శనివారం నిర్వహించనున్న 'స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర' కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆమె కోరారు.
కార్యక్రమంలో చిన్న పిల్లలు ప్రదర్శించిన అడ్వాన్స్ యోగా ఆసనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, రీజనల్ టూరిజం అధికారి లక్ష్మీనారాయణ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రఘు, సెట్కూర్ సీఈఓ వేణుగోపాల్, ఎస్ఏపీ క్యాంప్ డీఎస్పీ మహబూబ్ బాషా, ఆయుష్ జిల్లా యోగా నోడల్ అధికారి డాక్టర్ అమర్నాథ్, ఆయుష్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రసాద్, యోగా రాష్ట్ర సెక్రటరీ అవినాష్, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.



# నంద్యాల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నేడు వినియోగంలో లేని వస్తువుల వేలం.

- వేలంలో పాల్గొన్న 29 మంది ఔత్సాహికులు..
- మొత్తం వస్తువులు 4,50,000/-రూపాయలకు వేలం.





పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఆదేశాలమేరకు ఏర్పాటు చేయచేయబడిన కమిటి జిల్లా సాయుధ బలగాల అదనపు ఎస్పి బి.చిన్నికృష్ణ ఆధ్వర్యంలో నేడు నంద్యాల పట్టణంలోని డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో (పోలీస్ క్వార్టర్స్ దగ్గర) ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 01.00 గంటల వరకు వేలంపాట నిర్వహించారు. వినియోగించదగని కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానేర్లు, ట్యాబులు, జెనరేటర్లు, యుపిఎస్ బాట్టరిలు మరియు ఇతర వస్తువులు బహిరంగ వేలం నిర్వహించడం జరిగింది. ఈ వేలం పాట నందు 29 మంది ఔత్సాహికులు వేలంలో పాల్గొనడం జరిగింది. ఆద్యంతం ఉత్కంఠ భరితంగా (పోటా పోటీగా) జరిగిన వేలంలో వినియోగంలో లేని మొత్తం వస్తువులను 4,50,000/- రూపాయలకు అబ్దుల్ వాహబ్ అనే వ్యక్తి దక్కించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సాయుధబలగాల అడిషనల్ ఎస్పీ తో పాటు ఏ ఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు , ఇన్స్పెక్టర్లు సూర్యమౌళి, సురేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు బాబు ,విజయ్ లు, జిల్లా పరిపాలన విభాగం అధికారులు వీరన్న, ఖాదర్ భాష పాల్గొన్నారు.

## గాజులపల్లెలో ఫార్మ్ పాండ్‌ను కలెక్టర్ పరిశీలన





మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో కమ్యూనిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫార్మ్ పాండ్‌ను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా గురువారం పరిశీలించారు.గ్రామంలో అమలవుతున్న సహజ సిద్ధ వ్యవసాయ విధానాలను పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడి సాగు పద్ధతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతు హుస్సేన్ తన పొలంలో వీడ్ మ్యాట్స్ వినియోగంతో రోజ్ (గులాబీ) సాగు, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా మేరిగోల్డ్ (బంతిపూలు) సాగు చేస్తున్న విధానాన్ని కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఆయిల్ పామ్ తోటల్లో సాగు చేస్తున్న అంతర పంటలు, పీఎండీఎస్ విధానంలో చేపడుతున్న వ్యవసాయ పద్ధతులపై అధికారులు, రైతుల నుంచి సమాచారం సేకరించారు.

## మనవరాలు పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం.



పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల జిల్లా అధ్యక్షులు దాసరి చింతలయ్య మనవరాలు ప్రిన్స్ పుట్టినరోజు సందర్భంగా ఎస్ పి జి, హిషూల్ దగర బ్లైండ్ స్కూల్ లోని పిల్లలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించబడిందని దాసరి చింతలయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన మనవరాలు పుట్టినరోజున అక్కడ ముందుగా పాస్టర్ ప్రిన్స్ పుట్టినరోజు వేడుకలు ముందు దేవుని ప్రార్థన చేసి అక్కడి చిన్న పిల్లలను వారి తల్లి తండ్రులను అక్కడి ఉపాద్యాలను గురించి ప్రార్థన చేశారు. ఈకార్యక్రమంలో ప్రిన్స్ కుటుంబ సభ్యులు పాల్గొని పిల్లలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు దాసరి చింతలయ్య తెలిపారు.

## కౌలు కట్టి సాగు చేస్తే ప్రకృతి కాటు

**● ప్రకృతి దెబ్బకు పత్తి సాగు మళ్లీ మొదటి నుంచి ● వర్షం కొట్టేసిన పంట.. గ్లాసుతో నీళ్లు పోస్తున్న రైతు ● కౌలు రైతు ఆవేదన.. పత్తి కోసం మళ్లీ పోరాటం ● పత్తి మొలకల కోసం కూలీలతో నీళ్లు పోస్తున్న రైతు**





హోళగుంద పల్లె వెలుగు జూన్ 18 హోలగుంద మండల పరిధిలోని గజ్జహల్లి గ్రామంలో నివాసం ఉంటున్న కౌలు రైతు చంద్రశేఖర్ రెడ్డి ప్రకృతి విపత్తుతో తీవ్రంగా నష్టపోయాడు. ఆయన సుమారు 20 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. అందులో 14 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశాడు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పొలంలో వేసిన పత్తి విత్తనాలు కొట్టుకుపోవడంతో పంట పూర్తిగా దెబ్బతింది. వర్షాలు తగ్గిన అనంతరం మరోసారి పత్తి విత్తనాలు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. విత్తనాలకు తగినంత తేమ అందేలా కూలీలను పెట్టుకుని విత్తనం వేసిన ప్రతి చోట గ్లాసుతో నీటిని పోయించి మొలకలు వచ్చేలా ప్రయత్నిస్తున్నాడు. ఇప్పటికే భూమికి కౌలు చెల్లించడం, విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులు భారీగా పెరగడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని చంద్రశేఖర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం తమలాంటి రైతులను ఆదుకుని తగిన సహాయం అందించాలని ఆయన కోరారు.

## ఓటర్ జాబితా అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న.

**రాష్ట్ర కురుబ కురుమ కార్పోరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప.**



ఆదోని (పల్లె వెలుగు): భారతదేశంలో ఒక మనిషికి ఒకే ఓటు ఉండాలని ఒక నినాదంతో రాష్ట్రాలన్నీ ఓటర్ సర్వే చేసి ఓటర్లకు సరైన పద్ధతిలో ఓటు కల్పించబోతుంది, ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సర్ ఓటర్ జాబితా సవరణ ప్రతి ఒక్కరూ చేసుకోవాలని సూచించారు, గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతి చోట కార్యకర్తలు బూత్ మెంబర్స్ క్లస్టర్లు టిడిపి కుటుంబ సభ్యులు అందరూ ఈ కార్యక్రమాన్ని తమ తమ గ్రామాల్లో చక్కగా నిర్వహించి పూర్తి చేసుకోవాలని సూచించారు, రాష్ట్ర కురుబ కురుమ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప మరియు కార్యకర్తలతో కలిసి కర్నూలు జిల్లా ఆదోని నియోజకవర్గంలో పెద్ద హరివాణంతో పాటు పలు గ్రామాలను సందర్శించి ఓటర్ జాబితా సవరణ కార్యక్రమంలో పాల్గొని వచ్చిన అధికారులను సచివాలయ సిబ్బందిలను పంచాయతీ సిబ్బందిలను అడిగి తెలుసుకున్నారు, అలాగే కార్యకర్తలకు ప్రజలకు ఈ ఓటర్ అవగాహన గురించి తెలియజేశారు తెలుగుదేశం పార్టీలో 18 సంవత్సరం నిండిన ప్రతి కార్యకర్తకు ఓటు హక్కు కల్పించడానికి ఇది ఒక మంచి అవకాశం అని తెలియజేశారు.

# కర్నూలులో ప్లాస్టిక్‌పై ఉక్కుపాదం

## : 207 కేజీల ప్లాస్టిక్ స్వాధీనం, రూ. 45 వేల జరిమానా






పల్లె వెలుగు కర్నూలు బ్యూరో నగరంలో సింగిల్ యూజ్ (ఏకకాల వినియోగ) ప్లాస్టిక్ నివారణే లక్ష్యంగా కర్నూలు నగరపాలక సంస్థ అధికారులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. 'ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ – 2016' అమలులో భాగంగా నగరంలో గత కొన్ని రోజులుగా ప్లాస్టిక్ నియంత్రణ చర్యలను వేగవంతం చేశారు.

**వ్యాపార సముదాయాలపై దాడులు**

నగరపాలక సంస్థ కమిషనర్ ఆదేశాల మేరకు.. ఈ నెల 6వ తేదీ నుండి 16వ తేదీ వరకు పారిశుధ్య తనిఖీ అధికారులు, వార్డు శానిటేషన్ & ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు సంయుక్తంగా కర్నూలు పరిధిలోని వివిధ వ్యాపార సముదాయాలు, ప్లాస్టిక్ విక్రయ దుకాణాలు, వీధి వ్యాపారులపై విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా సుమారు 207 కేజీల నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించి ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగం జరుపుతున్న వారిపై రూ. 45,000ల జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. భారీ జరిమానాలు, చట్టపరమైన చర్యలు తప్పవు! నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను అమ్మడం కానీ, కొనడం కానీ చేయరాదని అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించి ప్లాస్టిక్ అమ్మే షాపుల యజమానులపై భవిష్యత్తులో మరింత భారీ జరిమానాలు విధించడమే కాకుండా, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రత్యామ్నాయాలపై 'కళాజాత' ద్వారా అవగాహన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేధించి, వాటి స్థానంలో పర్యావరణానికి హాని కలిగించని పేపర్ బ్యాగులు, కాటన్ బ్యాగులు, జ్యూట్ (జనపనార) బ్యాగులను ప్రత్యామ్నాయంగా ఉపయోగించాలని నగరపాలక సంస్థ కోరింది. దీనిపై నగర ప్రజలకు, వ్యాపార సముదాయాల యజమానులకు అవగాహన కల్పించేందుకు 'కళాజాత' బృందాల ద్వారా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ రహిత నగరంగా మారుద్దాం: కమిషనర్ పిలుపు కర్నూలు నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించడానికి నగర ప్రజలు, వ్యాపారులు తమ వంతు సహకారాన్ని అందించాలని కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ విజ్ఞప్తి చేశారు. అందరూ భాగస్వాములై కర్నూలును ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్‌కు కూడా సమాచారం అందించినట్లు అధికారులు పేర్కొన్నారు.

# మైనర్ అధికారుల మాయాజాలం

**☛రిపేరు పేరుతో చెరువు లో నీళ్లు ఖాళీ ☛అక్రమంగా చేపలు పడుతున్నారని ఫిర్యాదు**





బండిఆత్మకూరు పల్లెవెలుగు జూన్ 18: రాజకీయమనే అధికార మత్తులో పడిపోయిన కొందరు మైనర్ ఇరిగేషన్ అధికారులు మాయా జాలాన్ని సృష్టిస్తున్నారు. రిపేర్ల పేరుతో చెరువు లో నీళ్లన్ని బయటకు వదలి వేయటం వల్ల రైతు ప్రయోజనాలను ఆర్థికంగా దెబ్బ తీసే విధంగా ప్రవర్తిస్తున్నారు. బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న సింగవరం గ్రామానికి సమీపంలో ఉన్న బండి ఆత్మకూరు చెరువు షట్టర్లకు మరమ్మతులు చేయాలని ఈనెల 12వ తేదీన చెరువులోని నీళ్లను బయటకు వదిలివేశారు. చెరువులో నీళ్లను బయటికి వదిలి వారం రోజులవుతున్నప్పటికీ సెట్టర్ల మరమ్మత్తులకు మాత్రం మైనర్ ఇరిగేషన్ అధికారులు పూనుకోకపోవడం విడ్డూరంగాను వింత గాను ఉంది. ఈ చెరువు కింద రెండు వందల ఎకరాల ఆయకట్టు భూములు సాగవుతూ ఉండగా, మరో 200 ఎకరాల నాన్ ఆయకట్టు భూములు సాగు అవుతూ ఉన్నాయి. చెరువులో నీళ్లన్ని ఖాళీ అవడంతో భవిష్యత్తులో తమ భూములకు నీటి అవసరాలు ఎక్కడినుంచి వస్తాయని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఏ అధికారంతో మైనర్ ఇరిగేషన్ అధికారులు చెరువులో నీళ్లన్నీ బయటకు వదిలివేశారని కూడా రైతులు ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు జలహారతి కార్యక్రమం పేరుతో కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమం కొరకు కృషి చేస్తూ ఉంది. ప్రతి నీటి బిందువు వృథా కాకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పదేపదే హెచ్చరిస్తూ ఉండగా, మైనర్ ఇరిగేషన్ అధికారులు మాత్రం ఇందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. చెరువులో నీళ్లన్నీ ఎందుకు వదిలివేశారు అని అధికారులను ప్రశ్నిస్తే మరమ్మతులని సాకులు చెబుతున్నారు. ఎంతసేపు! ఒక వాన పడితే చెరువు నిండిపోదా! అంటూ కూడా వితండవాదం చేస్తున్నారు. చెరువులో నీళ్లు అంటిని బయటికి వదిలేందుకు వేరే కారణాలు ఉన్నాయన్న సత్యం అధికారులకు తెలిసినప్పటికీ, దానికి మాత్రం సరైన రీతిలో సమాధానం ఇవ్వడం లేదు.

**వివాదంగా మారిన చేపల పంచాయతీ**

చెరువులో నీళ్లన్నీ ఖాళీ కావడంతో తమ పరిస్థితి ఏమిటని అన్నదాతలు ఒకవైపు ఆందోళన చెందుతూ ఉండగా, మరోవైపు చెరువులో చేపల వ్యవహారం వివాదానికి తెరలేపింది. బండి ఆత్మకూరు చెరువు గత 30 సంవత్సరాల నుండి గడివేముల మండలం కరిమద్దెల గ్రామ సొసైటీ పరిధిలో ఉంది. ఈ చెరువులో చేపలు పట్టుకునేందుకుగాను వెలుగోడు కు చెందిన సింగ సాని వెంకట రమణ అనే లీజు దారుడు కరిమద్దల గ్రామ సొసైటీకి రెండు విడతలుగా 4.5 లక్షల రూపాయలను చెల్లించానని చెబుతున్నారు. చెరువులో నీళ్లు ఖాళీ అవడంతో చేపలు పట్టుకునేందుకు బండి ఆత్మకూరుకు చెందిన స్థానిక నాయకులు కొందరు చేపలు పట్టుకునేందుకు గురువారం ప్రయత్నాలు చేశారు. ఈ విషయం చెరువు లీజు దారుడు సింగసాని వెంకట రమణకు తెలియడంతో చెరువు దగ్గరకు చేరుకున్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. ఇరువురు పోలీసులు వెంటనే చెరువు దగ్గరకు చేరుకొని చేపలు పట్టే ప్రయత్నాన్ని విరమింప చేశారు. ఈ విషయంలో ఓ నాయకుడు జోక్యం చేసుకొని ఎమ్మెల్యే చెప్పారు అంటూ అక్కడివారికి చెప్పారని సమాచారం. ఈ విషయాన్ని తాను ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తానని లీజుదారుడు సింగసాని వెంకట రమణ అక్కడి నుండి ఆత్మకూరుకు బయలుదేరి వెళ్లారు. చెరువులో అక్రమంగా చేపలు పడుతున్నారన్న విషయాన్ని నందికొట్కూరుకు ఫిషరీ డెవలప్మెంట్ అధికారి భరత్ కూడా లీజుదారుడు సమాచారం అందించారు. ఎఫ్డిఓ భరత్ వెంటనే ఇక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఈ విషయంలో ఆయన ఏమి చేయకుండా వెనుతిరిగి పోయారు.

## తెనాలిలో వైఎస్సార్ విగ్రహ తయారీని పరిశీలించిన

# మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి..





పల్లె వెలుగు గుంటూరు. గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పర్యటించారు. తెనాలిలోని ప్రముఖ శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, వారి తనయుడు కాటూరి రవిచంద్ర ల ఆధ్వర్యంలో రూపుదిద్దుకుంటున్న దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహ తయారీని ఆయన స్వయంగా పరిశీలించారు. విగ్రహ శిల్పకళా నైపుణ్యాన్ని చూసి ఆయన శిల్పులను అభినందించారు. నంద్యాల పట్టణం శ్రీనివాస సెంటర్ నందు ఇటీవల మహానేత దివంగత డా.వైఎస్సార్ విగ్రహం ధ్వసం జరిగిన ఘటన నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి తన సొంత నిధులతో డా.వైఎస్సార్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని ప్రజల సాక్షిగా ప్రకటించడం జరిగింది. ఈ మేరకు ఆయన తెనాలీలో డా.వైఎస్సార్ విగ్రహ తయారీని పరిశీలించారు. శిల్పకళకు పుట్టినిల్లుగా పేరుగాంచిన తెనాలి పట్టణంలో మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహ తయారీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నంద్యాల నియోజకవర్గంలో ఏర్పాటు చేయనున్న అత్యంత భారీ, ప్రతిష్టాత్మక వైఎస్సార్ విగ్రహాన్ని తెనాలికి చెందిన ప్రముఖ అంతర్జాతీయ శిల్పి కాటూరి వెంకటేశ్వరరావు, వారి కుమారుడు కాటూరి రవిచంద్ర తయారు చేస్తున్నారు. ఈ విగ్రహ తయారీ పనులను మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి గారు శిల్పశాలను సందర్శించి స్వయంగా పరీక్షించారు. విగ్రహం యొక్క రూపకల్పన, వైఎస్సార్ గారి ముఖంలో ఉండే ఆ చిరునవ్వు, ఆయన రాజసం ఉట్టిపడేలా శిల్పాన్ని మలుస్తున్న తీరును చూసి రవిచంద్ర కిషోర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్ రూపానికి నిలువెత్తు రూపంగా ఈ విగ్రహాన్ని తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు.

# రెండేళ్ల పాలన ప్రజా విశ్వాసానికి నిదర్శనం: ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి

## శిల్పా వ్యవహార శైలిపై విసుగు చెంది టీడీపీలో చేరిన ఆత్మకూరు ఎంపీపీ, పలువురు మైనార్టీ నేతలు

- ఆత్మకూరులో ఘనంగా రెండేళ్ల పాలన సభ.వేలాదిగా తరలివచ్చిన ప్రజానీకం
- సంక్షేమం, అభివృద్ధి రెండు చక్రాలుగా నియోజకవర్గ ప్రగతి,
- రెండేళ్లలో రూ. 700 కోట్లతో అభివృద్ధి పనులు,
- అభివృద్ధిపై చర్చకు శిల్పా చక్రపాణి రెడ్డికి ఎమ్మెల్యే సవాల్,



బండిఆత్మకూరు, పల్లె వెలుగు, జూన్ 18: రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకుని, సంక్షేమంలోనూ,అభివృద్ధిలోనూ ప్రజాదరణతో దూసుకుపోతోందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణంలోని ఆర్.ఆర్ కన్వెన్షన్ హాల్ నందు గురువారం నిర్వహించిన 'రెండేళ్ల పాలన – సంక్షేమం, అభివృద్ధి' సభ వేలాదిగా తరలివచ్చిన ప్రజల మధ్య అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం గత రెండేళ్లలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన అందించిందని కొనియాడారు. కేంద్రంలో మోదీ సహాకారం, రాష్ట్రంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ల సారథ్యంలో సంక్షేమ పథకాల అమలుతో పాటు రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాదులు పడ్డాయని, పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక వసతుల కల్పన, వ్యవసాయ రంగానికి ప్రోత్సాహం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి కల్పనలో ప్రభుత్వం విశేష ఫలితాలు సాధించిందని వివరించారు. నియోజకవర్గ పరిధిలో గత రెండేళ్లలో రూ. 700 కోట్ల నిధులతో రికార్డు స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సున్నిపెంటలో రూ. 11 కోట్లతో రోడ్ల విస్తరణ, నూతన సీసీ రోడ్ల నిర్మాణం, ప్రధాన రహదారులపై డివైడర్లు, డ్రైనేజీ కాలువలు, వీధి దీపాల ఏర్పాటు. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి అవసరాలు తీర్చేందుకు రూ. 140 కోట్లతో ఇంటింటికీ తాగునీటి సౌకర్యం, మరో రూ. 22 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ ఆధునికీకరణ. శ్రీశైలం జలాశయం, సిద్ధాపురం ఎత్తిపోతల పథకం, తెలుగుగంగ, కేసీ కెనాల్ వంటి సాగునీటి ప్రాజెక్టులను గాడిలో పెట్టి రైతాంగాన్ని ఆదుకున్నామన్నారు. మహానంది – బోయలకుంట్ల మెట్ట వరకు సుమారు రూ. 8కోట్లతో నూతన రహదారి నిర్మాణంతో పాటు బండి ఆత్మకూరు, మహానంది మండలాల్లో నూతన రహదారుల నిర్మాణంతో ప్రజా రవాణాను మెరుగుపరిచామన్నారు, బండి ఆత్మకూరు మండల కేంద్రంలో శ్రీశైలం, మహానంది దేవస్థానాల ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి, ప్రభుత్వ కళాశాలలు, కస్తూర్బా గాంధీ పాఠశాలలు, మోడల్ స్కూళ్లలో మౌలిక వసతుల విస్తరణ. ప్రభుత్వ ఆసుపత్రి, ఆర్టీసీ బస్టాండ్‌లలో మినరల్ వాటర్ ప్లాంట్లు, మెరుగైన వసతుల కల్పన చేస్తున్నామన్నారు.

### శిల్పాకు షాక్.. టీడీపీలో చేరిన ఆత్మకూరు ఎంపీపీ మరియు మైనార్టీ నేతలు

తమను ప్రజలు చీదరించుకున్నా వైసీపీ నేతలకు ఇంకా బుద్ధి రాలేదని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆ పార్టీ నేతలు ఇప్పటికీ అదే తప్పుడు ప్రచారాలు, అహంకార ధోరణిని అవలంబిస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి దమ్ముంటే నియోజకవర్గ అభివృద్ధిపై ప్రజల ముందే నేరుగా చర్చకు రావాలని సవాల్ విసిరారు. శిల్పా చక్రపాణి రెడ్డి అహంకార, దిగజారుడు తీరుపై విసుగు చెంది ఆత్మకూరు ఎంపీపీ తిరుపాలమ్మ పాటు వెంకటాపురం, కరివేన గ్రామాలకు చెందిన సుమారు 150 కుటుంబాలు మైనార్టీ, దళిత కుటుంబాలు ఆ పార్టీని వీడి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి కండువా వేసి







పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి గారు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం పథకాల పట్ల ఆకర్షితులై.. మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అహంకార ధోరణి పట్ల విసుగుచెంది టీడీపీలో చేరుతున్నట్లు ఎంపీపీ తిరుపలమ్మ పేర్కొన్నారు. వెంకటాపురం గ్రామానికి చెందిన మైనార్టీ నేత నజీర్ అహమ్మద్ మాట్లాడుతూ.. ఎన్డీయే కూటమి ప్రభుత్వంతోనే మైనార్టీల సంక్షేమం సాధ్యమని భావించి పార్టీలో చేరినట్లు



పేర్కొన్నారు.

### సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ.

పేద ప్రజలకు సీఎం సహాయ నిధి ఒక వరం అని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. గురువారం ఆత్మకూరులో జరిగిన రెండేళ్ల పాలన సంక్షేమం అభివృద్ధి కార్యక్రమం అనంతరం నియోజకవర్గ పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 51 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 30 లక్షల విలువగల చెక్కులను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ.. సీఎం నారా చంద్రబాబు నాయుడు సహకారంతో పార్టీలకు అతీతంగా సహాయం కోరిన ప్రతి ఒక్కరికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం అందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో వెంకట శివ ఆత్మకూరు,వెలుగోడు,బండి ఆత్మకూరు మండలాలకు చెందిన అధికారులు తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలి.

ఎమ్మెల్యే డాక్టర్ పి.వి. పార్థసారథి.

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని మండలం





ధనాపురం గ్రామంలోని రైతు హనుమంతు పొలంలో నిర్వహించిన పత్తి విత్తనాల నాటే కార్యక్రమంలో ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పి.వి. పార్థసారథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి పొలంలో పత్తి విత్తనాలను నాటారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశానికి వెన్నెముక రైతేనని, రైతుల సంక్షేమమే దేశాభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు పత్తి సాగుతో పాటు కంది, జొన్న, కొర్ర వంటి అంతర పంటలను సాగు చేయడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని సూచించారు. అలాగే అలసంద పంట తక్కువ పెట్టుబడితో సాగు చేయదగినదని, ఇది మానవ వినియోగంతో పాటు పశువుల మేతకు కూడా ఉపయోగపడుతుందని తెలిపారు. మార్కెట్లో మంచి డిమాండ్ ఉండటంతో రైతులకు అదనపు ఆదాయం సమకూరే అవకాశముందని చెప్పారు. పత్తి పంటను సకాలంలో విత్తి శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆదోని మండల వ్యవసాయ అధికారి, బీవీజీ సుధాకర్, వ్యవసాయ విస్తరణాధికారి పి. సతీష్, గ్రామ వ్యవసాయ సహాయకులు నలిని, వినీత్, హరి రామ్, అయ్యన్న, రైతులు హనుమంతు, రామాంజి, బసప్ప, అంజని, వీరాంజనేయులు, తాయేషు, గ్రామ నాయకులు నిత్యానంద, విశ్వనాథ, రాముడు, హుస్సేను తదితరులు పాల్గొన్నారు. గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బండి ఆత్మకూరు పోలీస్ స్టేషన్ ను సందర్శించిన ఏఎస్పి జావళి



బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూన్ 18: నంద్యాల జిల్లా ఎస్పీ మందా జావళి గురువారం బండి ఆత్మకూరు పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లో పలు రికార్డులను ఏఎస్పి పరిశీలించారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చే ఫిర్యాదు దారుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని పోలీసులకు సూచించారు. పోలీస్ స్టేషన్లో పెండింగ్లో ఉన్న కేసులను గురించి ఎస్ఐ జగన్మోహన్ ను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ సి బ్బంది పనితీరు, చేస్తున్న సేవలను గురించి ఏఎస్పి నేరుగా అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను గురించి ఏఎస్పి ఆరా తీశారు.

## మొహరంను ప్రశాంతంగా జరుపుకోండి: ఎస్సై



మహానంది, పల్లె వెలుగు మొహరం పండుగ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని మహానంది ఎస్ఐ ఎన్. రామ్మోహన్ రెడ్డి సూచించారు. గురువారం మహానంది మండలం బొల్లవరం గ్రామంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఎస్సై ఎస్సై మాట్లాడుతూ.. మహానంది మండలంలోని గ్రామాల్లో మొహరం వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి అల్లర్లకు పాల్పడకూడదు అన్నారు. డీజే లకు అనుమతి లేదన్నారు. మొహరం వేడుకలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఎమ్మార్పీఎస్ ఎం ఎస్ పి ఆధ్వర్యంలో గో టు విలేజ్ కార్యక్రమం.

పల్లె వెలుగు నంద్యాల రూరల్. ఎమ్మార్పీఎస్




ఎంఎస్పి ఆధ్వర్యంలో అనుబంధ సంఘాల వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందాక్రిష్ణ మాదిగ అన్నగారి ఆదేశాల మేరకు
ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు అన్న సూచనల మేరకు నంద్యాల నియోజకవర్గం నంద్యాల మండలం చాబోలి గ్రామంలో 40 రోజులు గో టు విలేజ్ కార్యక్రమం నంద్యాల మండల అధ్యక్షుడు సానికల రాము మాదిగ అధ్యక్షతన నిర్వహించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నంద్యాల ఎంఎస్పి జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు నంద్యాల మండల ఇంచార్జ్ అయిన భూపనపాటి నరసింహులు మాదిగ పాల్గొని, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 30 ఏళ్ల ఉద్యమంలో మనము సాధించుకున్నటువంటి వర్గీకరణ ఫలాలు మన బిడ్డలకు భవిష్యత్తులో అవి ఉపయోగపడాలంటే మనము మన పిల్లలను చదివించుకుని ప్రయోజకులను చేయాలని అన్నారు. అలాగే ఏదైతే మాదిగ ఆత్మగౌరవం జెండా పండుగ జులై ఏడో తారీఖున గ్రామ గ్రామాన నిర్వహించి పెద్ద ఎత్తున మాదిగలు సంఘటితం అవ్వాలని , పద్మశ్రీ మందకృష్ణ మాదిగ భవిష్యత్తులో పిలుపునిచ్చిన మనం ముందుకు సాగాలని తెలియజేశారు .

ఈ కార్యక్రమంలో చాబోలు గ్రామం పెద్దలు చంటి మాదిగ , సాంబశివుడు మాది , పవన్ కళ్యాణ్ మాదిగ , శివ మాది , సుధాకర్ మాదిగ , గ్రామ నాయకులు భవిష్యత్ తరాల పిల్లలు పాల్గొనడం జరిగింది.



# ఘనంగా మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు

ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 18 పల్లె వెలుగు మాజీ ఎమ్మెల్సీ కర్నూల్ పార్లమెంట్ పరిశీలకులు



గంగుల ప్రభాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం నాడు పట్టణంలోని వైయస్సార్ పార్టీ కార్యాలయంలో గంగుల ప్రభాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు .మాజీ ఎమ్మెల్సీ గంగుల జన్మదినం పురస్కరించుకొని వైఎస్ఆర్సిపి పార్టీ సీనియర్ నాయకులు గంగుల రామిరెడ్డి , శివ నాగిరెడ్డి, గుబగుండం వెంకటసుబ్బారెడ్డి , సీనియర్ న్యాయవాది అశ్వత్ రెడ్డి , సోమశేఖర్ రెడ్డి, ఏఎన్ఆర్ చికెన్ సెంటర్ హుస్సేన్ బాషా, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ ప్రెసిడెంట్ కూలూరు నరసింహారెడ్డి, మాజీ కౌన్సిలర్ సుధాకర్ రెడ్డి ,నరసింహులు, భాస్కర్ రెడ్డి ,రాజగోపాల్ రెడ్డి , కొత్తూరు సునీల్, పడకండ్ల భాస్కర్ రెడ్డి, ముత్యాలపాడు బాబు దామోదర్ రెడ్డి, బబ్లు, మాదం చెన్నయ్య, ధనుంజయ, గుర్రప్ప, సిద్ధనాగులు కార్యకర్తలు అభిమానులు కలసి జన్మదిన కేకును కట్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి జన్మదిన పురస్కరించుకొని అనాధ ఆశ్రమలలో అనాధలకు అన్నదానం చేశారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన

**- టిడిపి సీనియర్ నాయకులు భూమా జగత్ విఖ్యాత రెడ్డి.**



ఆళ్లగడ్డ ప్రతినిధి,జూన్18 పల్లె వెలుగు ఆళ్లగడ్డ పట్టణం రామలక్ష్మి కొట్టాలకు చెందిన భూమా కుటుంబ అభిమాని నల్లబోతుల అంజయ్య కుమారుడు వివాహానికి ఆళ్లగడ్డ పట్టణంలోని షాదీ ఖానా ఫంక్షన్ హాల్లో హాజరై నూతన వధూవరులను ఆళ్లగడ్డ టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి ఆశీర్వదించారు. ఆయన వెంట ఆళ్లగడ్డ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ షేక్ హుస్సేన్ భాష ఉన్నారు.

# పట్టణ మరియు పరిసర ప్రాంత ప్రజలకు శుభవార్త.

**డాక్టర్ సింధూర,,,,,**




ఎమ్మిగనూరు పల్లె వెలుగు జూన్ 18 ఇప్పుడు నాణ్యమైన ప్రసూతి మరియు మహిళల ఆరోగ్య సేవలు మీకు మరింత చేరువలో అందుబాటులో ఉన్నాయి. ఎమ్మిగనూరులోని ధీరన్ మెడికేర్ హాస్పిటల్లో ఎన్టీఆర్ వైద్య సేవ( ఆరోగ్యశ్రీ) పథకాల ద్వారా అర్హులైన పేద ప్రజలకు సాధారణ ప్రసవాలు మరియు సిజేరియన్ ఆపరేషన్లు పూర్తిగా ఉచితంగా నిర్వహించబడుతున్నాయి. అనుభవం కలిగిన మహిళా వైద్యురాలు డాక్టర్ సింధూర ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు ప్రత్యేక వైద్య సేవలు అందించబడుతున్నాయి. గర్భధారణ పరీక్షలు, రెగ్యులర్ చెకప్‌లు, స్కానింగ్ సదుపాయం, తల్లి-శిశు ఆరోగ్య సంరక్షణ, నెలసరి సమస్యలకు చికిత్స వంటి సేవలు అందుబాటులో ఉన్నాయి. తల్లి మరియు శిశువు ఆరోగ్యం... మా బాధ్యత. జూన్ 10 నుండి జూన్ 31 వరకు గర్భిణీ స్త్రీ లకు ఉచితంగా స్కానింగ్ చేయబడును. మరిన్ని వివరాలకు: 94913 94222, 94916 94222 ధీరన్ మెడికేర్ హాస్పిటల్ ఇందిరానగర్, ఎంజీ పెట్రోల్ బంక్ సమీపంలో, ఆదోని--మంత్రాలయం బైపాస్ రోడ్, ఎమ్మిగనూరు.

# నూతన గృహప్రవేశానికి

**-జిల్లా అధికార ప్రతినిధి -దేశాయ్ గురురాజ్**





ఎమ్మిగనూరు పల్లె వెలుగు జూన్ 18 ఎమ్మిగనూరు మండలం పార్లపల్లి గ్రామంలోని బిజెపి ఓబీసీ మోర్చా ఎమ్మిగనూరు మండలం అధ్యక్షులు గురుమూర్తి నూతన గృహ ప్రవేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన దేశాయ్ నెట్వర్క్ అధినేత బిజెపి కర్నూలు జిల్లా అధికార ప్రతినిధి గురు రాజ్ దేశాయ్ కి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పాల్గొంటూ గురుమూర్తి ఇంటి ప్రారంభోత్సవం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలు మరియు ఐశ్వర్యాలతో నిండిపోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ కర్నూలు జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మరియు సినియర్ నాయకులు బిఎల్ నారాయణ, ఉపాధ్యక్షులు గాజుల సురేంద్ర, బిజెపి కార్యకర్త పార్లపల్లి రామకృష్ణ, మాజీ సర్పంచ్ రామన్న గౌడ్, బిజెపి పార్టీ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు కల్లెల శివ, ఆది ఆంధ్ర స్కూల్ చైర్మన్ పి.శివ, సోషల్ మీడియా కన్వీనర్ దండు వీరేష్ మరియు బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# నంద్యాల మార్క్‌ఫెడ్ గోదాముల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.







పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ శాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ నేడు నంద్యాలలోని బొమ్మలసత్రం లో ఉన్న మార్క్‌ఫెడ్ కార్యాలయం మరియు గోదాములను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పర్యటనలో భాగంగా మంత్రి ఫరూక్ గోదాముల్లో నిల్వ ఉన్న సరుకు నిల్వలను (స్టాక్) క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం అక్కడున్న రికార్డులను తనిఖీ చేసి, నిల్వల వివరాలు, పంపిణీ తీరును గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిల్వల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా, పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులను మంత్రి ఫరూక్ ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు సకాలంలో సేవలు అందేలా చూడాలని, గోదాములలో ఉన్న సరుకుల నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని సూచించారు.

ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, నంద్యాల మండల కన్వీనర్ మునగాల విశ్వనాథ్ రెడ్డి, ఉడుమలాపురం కళ్యాణ్, రాయమాల్పురం చంద్రారెడ్డి, పబ్బతి వేణు , మున్నా, నాగేశ్వరరావు, బుగ్గ రాముడు మరియు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితం నాశనం చేసుకోవద్దు.

**మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజల సహకారం అవసరం..... సబ్ ఇన్స్పెక్టర్ మణికంఠ .**



పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లా గంజాయి ఇతర మాదకద్రవ్యాల మూలాలతో పాటు నిర్మూలించేందుకు ప్రజలను చైతన్యవంతులుగా చేయాలన్న జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఆదేశాలమేరకు బ్రాహ్మణకోట్కూరు గ్రామంలోని మద్దురునగర్ నందు మాదకద్రవ్యాల నివారణ మరియు వాటి దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సు బ్రాహ్మణకోట్కూరు సబ్ ఇన్స్పెక్టర్ మణికంఠ ఆధ్వర్యంలో నిర్వహించబడింది.

ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన సబ్ ఇన్స్పెక్టర్ మణికంఠ మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబాలు, సమాజం మరియు దేశ భవిష్యత్తుపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. మాదకద్రవ్యాలకు బానిసైన వ్యక్తులు ఎదుర్కొన్న సమస్యలు, వాటి కారణంగా సంభవించిన నేరాలు మరియు సామాజిక పరిణామాలకు సంబంధించిన కొన్ని ముఖ్యమైన కేస్ స్టడీస్‌ను ఉదాహరణలుగా వివరించి ప్రజలకు అవగాహన కల్పించారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. అనుమానాస్పదంగా మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగం గమనించినట్లయితే వెంటనే పోలీసు శాఖకు సమాచారం అందించి సమాజాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువత, మహిళలు మరియు ఇతర ప్రముఖులు పాల్గొని మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన పొందారు.

సమాజంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# జీవితకాల సారథి గడియారం

పల్లె వెలుగు:మానవ జీవన సాఫల్యంలో సమయపాలన కీలక భూమిక పోషిస్తుంది. ప్రగతి, పురోగతి సాధనలో కాలం విలువైనదని గడియారం హెచ్చరిస్తుంది. టిక్ టిక్ మంటూ సాగే గడియారపు ముళ్లు నిరంతరం శ్రమించే, విరామం ఎరుగని ఓ కాలయంత్రం. మానవ ప్రగతికి నీవే కదా సూత్రధారి. ప్రణాళికల అమలుకు నీవే కదా దిక్సూచి. నిశ్శబ్ద రాత్రుల్లో నీ ముళ్లు కదిలినా, నిద్రించే లోకానికి అలారం శబ్దంతో మేలుకొలుపు పాడుతావు. జనాన్ని పనులకు పురమాయిస్తావు. సుఖమున్నా, కష్టమున్నా సమానంగా చూస్తూ సమదృష్టితో బతకాలని పాఠాలు నేర్పుతావు. రాజునైనా, పేదనైనా ఒకేలా చూస్తావు. ధనం ఉన్నా, బలం ఉన్నా నీ పరుగును ఆపలేరు. గడచిన కాలం తిరిగి రాదని చెబుతూ, సమయమే సంపద అని హితబోధ చేస్తావు. ముందుకు సాగాలని నిత్యం హెచ్చరిస్తావు. “ఆగదు ఏ నిమిషము నీకోసం, ఆగితే సాగదు ఈ లోకం” అనే పాట జీవితం లో సమయ విలువను గుర్తు చేస్తుంది. గడియారమే ఆ స్ఫూర్తికి ప్రతీక. ఓటమితో కుంగిపోతే టైమ్ దాటిపోతుందని అంటావు. గెలుపుతో విర్రవీగితే గర్వపడవద్దని వారిస్తావు. క్షణాల విలువను గుండె చప్పుడుగా మారుస్తూ, బ్రతుకు పుస్తకంలోని పేజీలను తిప్పేస్తుంటావు. నీవు తిరిగే గుండ్రని వలయం మనిషికి జీవిత కాలచక్రాన్ని నేర్పుతుంది. సమయమే సంపద అని చాటుతుంది. సకాలంలో స్పందిస్తేనే సత్ఫలితాలు సిద్ధిస్తాయని దశ, దిశలను నిర్దేశిస్తావు. కష్టాల చీకటి తర్వాత సుఖాల వెలుగు వస్తుందని, మార్పు ఒక్కటే జగతిలో శాశ్వతమని చెబుతావు. ఆశావహ దృక్పథంతో అడుగులు వేస్తే అభివృద్ధి సాకారమవుతుందని సూచిస్తావు. ఆలస్యం అమృతం విషమని గుర్తుచేస్తూ, కర్తవ్యాన్ని సకాలంలో నెరవేర్చమంటావు. నీ కదలికలతో మానవ మనుగడ ముడివడి ఉంది. ప్రతి క్షణాన్ని అద్భుతంగా బ్రతకమని దీవిస్తావు. హృదయపు లయకు నువ్వే తోడు. నీతో నడిచినవాడు ఎన్నటికీ బేజారు కాడు. చేతికి ధరించే కాలరత్నానివి. స్త్రీ, పురుష భేదం లేకుండా అందరికీ ముంజేతి కంకణమవుతావు. ఆరోగ్య సూచనలకు మార్గదర్శిగా, డిజిటల్ సమాచార దర్శిగా నేడు అలరిస్తున్నావు. నిన్ను గెలిచినవాడే లోకానికి విజేత అవుతాడు. మన జీవనశైలి కావాలి. సమయపాలనతో వికసిత భారత లక్ష్య సాధనకు పౌర సమాజం సాగిపోవాలి. ఆగదు కాలం... ఆగదు ఈ జీవన గమనం. కాలసారథి నడిపించే దారిలో సాగిపోవడమే మన కర్తవ్యం కావాలి. జూన్ 19 -- జాతీయ వాచ్ దినోత్సవం సందర్భంగా)-- నేదునూరి కనకయ్యకాలమిస్ట్, కరీంనగర్

# ఆరోగ్యకరమైన వృద్ధాప్యానికి యోగా ఎంతో అవసరం: ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

**☛‘యోగాంధ్ర 2026’లో భాగంగా కర్నూలు బాప్రా క్యాంపులో ఘనంగా యోగా దినోత్సవం**

**☛పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్**

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో యోగా అనేది కేవలం ఒక వ్యాయామం మాత్రమే కాదని, అది ఒక సంపూర్ణ జీవిత విధానమని పాణ్యం నియోజకవర్గ శాసనసభ్యురాలు, టీడీపి నంద్యాల జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గౌరు చరిత రెడ్డి అన్నారు. గురువారం ‘యోగాంధ్ర 2026’ కార్యక్రమంలో భాగంగా కర్నూలు నగరంలోని ఎస్ఏపీ (బాప్రా) క్యాంపు మైదానంలో ఘనంగా యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం అధికారులతో కలిసి ఆమె యోగాసనాలు వేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఏడాది “ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా” అనే అద్భుతమైన సందేశంతో యోగా ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్లడం సంతోషకరమన్నారు. నేటి ఆధునిక కాలంలో మారుతున్న జీవనశైలి కారణంగా అనేకమంది హైపర్‌టెన్షన్ (రక్తపోటు), మధుమేహం (షుగర్) వంటి వ్యాధుల బారిన పడుతున్నారని, వాటిని సమర్థవంతంగా నివారించడంలో యోగా ఎంతో అద్భుతంగా ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం, ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం యోగాను తమ దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ వినూత్న కార్యక్రమంలో కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, నగర మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు తదితర ఉన్నతాధికారులు పాల్గొని యోగాసనాలు వేశారు. యోగాను నిత్య జీవితంలో అలవరచుకోవడం ద్వారా ఒత్తిడి లేని సమాజాన్ని నిర్మించవచ్చని అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, విద్యార్థులు, నగర ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగా సాధన చేశారు.



# మత్తు పదార్థాలకు ప్రజలు దూరంగా ఉండాలి

- సమాజానికి చేటు తెచ్చే వ్యసనాలపై అవగాహన పెంచాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి పిలుపు.. అధికారులచే ప్రతిజ్ఞ.






పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సమాజాన్ని పట్టి పీడిస్తున్న మత్తు పదార్థాల సేవనం, రవాణాను పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి పిలుపునిచ్చారు. కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన థిమాటిక్ యోగా కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాల నియంత్రణపై ఒక ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సెట్కూర్ సీఈవో వేణుగోపాల్ అక్కడకు విచ్చేసిన వారందరితో ప్రతిజ్ఞ చేయించారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. సమాజంలో గుట్కా, గంజాయి, అఫీమ్, ఎండీఎంఏ వంటి ప్రాణాంతక కెమికల్స్, మత్తు పదార్థాల వినియోగం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. 'ఈగల్ టీం' సహకారంతో యోగా ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజలకు వీటిపై విస్తృతంగా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. యువత, ప్రజలు ఎవరు కూడా ఇలాంటి మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదని, వాటి రవాణాకు పాల్పడకూడదని స్పష్టం చేశారు. మత్తు లేని సమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్రముఖుల హాజరు: ఈ ప్రతిజ్ఞా కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, పాణ్యం శాసనసభ్యురాలు గౌరు చరిత, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు పాల్గొని మత్తు పదార్థాల వ్యతిరేక ప్రచారానికి మద్దతు తెలిపారు. అలాగే రీజనల్ టూరిజం అధికారి లక్ష్మీనారాయణ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రఘు, ఎస్ఏపీ క్యాంప్ డీఎస్పీ మహబూబ్ బాషా, ఆయుష్ జిల్లా యోగా నోడల్ అధికారి డాక్టర్ అమర్నాథ్, ఆయుష్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రసాద్, యోగా రాష్ట్ర సెక్రటరీ అవినాష్, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ్య కార్మికులు, సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.

# కూటమి ప్రభుత్వ రెండేళ్ల సందర్భంగా

- భారీ మోటార్ బైక్ ర్యాలీ, విజయోత్సవ సభలో
- ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి , ,









ఎమ్మిగనూరు పల్లె వెలుగు జూన్18 రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మిగనూరు పట్టణంలో ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో విజయోత్సవ సభ ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో భారీ మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. అన్నమయ్య సర్కిల్, శివ సర్కిల్, సోమప్ప సర్కిల్, శ్రీనివాస టాకీస్ సర్కిల్, మార్కెట్ యార్డ్ సర్కిల్, ఓం శాంతి సర్కిల్, స్టేట్ బ్యాంక్ సర్కిల్ మీదుగా కుర్ని కళ్యాణ మండపం వరకు భారీ ఎత్తున ర్యాలీ సాగింది. అనంతరం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ , ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిశీలకులు ముని శేఖర్ రెడ్డి , పట్టణ బూత్ పరిశీలకులు పోతురాజు రవికుమార్ , బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ తొగట నరసింహులు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రేఖా గౌడ్ తో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి మూడు పార్టీల జెండాలను ఆవిష్కరించి, స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి "మా తెలుగు తల్లి" ప్రార్థనా గీతంతో సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా గురజాలకు చెందిన ఎస్సీ నాయకులు పెద్ద కిషన్ మృతికి సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ గారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారని, తెలుగుదేశం పార్టీ అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తోందని పేర్కొన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ స్వర్గీయ బి.వి. మోహన్ రెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయ నాగేశ్వర్ రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నారని కొనియాడారు. బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ తొగట నరసింహులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో మహిళా సాధికారతకు పెద్దపీట వేయబడిందని, జన్ ధన్ పథకం ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించారని అన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీమతి రేఖా గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, గ్రామీణ ప్రగతిలో కూటమి ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. విజయోత్సవ సభను ఉద్దేశించి ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ "అగైన్. అగైన్.ఎన్డీఏ, నో అగైన్. వైసీపీ అంటూ ప్రజల తీర్పుతో ఏర్పడిన కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో కొత్త చరిత్ర సృష్టించిందన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలుతో పాటు తల్లికి వందనం, స్త్రీ శక్తి, దివ్యాంగ శక్తి, దీపం-2, అన్నా క్యాంటీన్లు, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా, ఆటో డ్రైవర్ల సంక్షేమ కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. చేనేత కార్మికులకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, డీఎస్సీ ద్వారా భారీ స్థాయిలో ఉద్యోగ నియామకాలు చేపట్టామని పేర్కొన్నారు. గాజులదిన్నె ప్రాజెక్టు ద్వారా తాగునీరు, సాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సత్తా చాటాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై బీఎల్ఎలు, బీఎల్ఓలతో సమన్వయం చేసుకుంటూ మై టిడిపి యాప్ ద్వారా ప్రతి ఓటరును ధృవీకరించి ఎన్యూమరేషన్ ఫారాలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. అనంతరం కార్యకర్తలతో భోజన విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ , జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్ జిల్లా కమిటీ సభ్యులు, బీజేపీ కో-కన్వీనర్ తొగట నరసింహులు, జనసేన ఇన్‌చార్జి రేఖా గౌడ్, నియోజకవర్గ పరిశీలకులు మునిశేఖర్ రెడ్డి ఎమ్మిగనూరు పట్టణ బూత్ పరిశీలకులు పోతురాజు రవికుమార్ , రాష్ట్ర కుర్ని కార్పొరేషన్ చైర్మన్ కామర్తి మిన్నప్ప, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురువ మల్లయ్య, మండల, పట్టణ అధ్యక్షులు, క్లస్టర్లు, యూనిట్, బూత్ కన్వీనర్లు, వ్యవసాయ సహకార సంఘ అధ్యక్షులతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి.... ఎస్సై మల్లికార్జున.

జూపాడు బంగ్లా, జూన్ :18 :: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని జూపాడు బంగ్లా ఎస్సై కే. మల్లికార్జున విద్యార్థులకు అవగాహన కల్పించారు. గురువారం మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్ మరియు కాలేజీ నందు ర్యాగింగ్ బాల్య వివాహాలపై మాదకద్రవ్యాల వాడకంపై విద్యార్థి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై కె. మల్లికార్జున మాట్లాడుతూ విద్యార్థులు యాంటీర్యాగింగ్,బాల్యవివాహాలు, ఫోక్స్ చట్టం, సైబర్ నేరాలు రహదారి ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల కలిగే హానికరమైన ప్రభావాలు జ్ఞాపక శక్తి మరియు ఏకాగ్రత తగ్గిపోవడం, చదువులో వెనకబడడం, శారీరిక మరియు మానసిక ఆరోగ్యం దెబ్బతినడం, కుటుంబ సభ్యులతో మరియు స్నేహితులతో సంబంధాలు దెబ్బ తినడం ఆర్థిక సమస్యలు మరియు నేరా ప్రవర్తనకు దారి తీయడం జరుగుతుంది అన్నారు. వ్యసనానికి గురై జీవిత లక్ష్యాలను,చెడు అలవాట్లు ఉన్న స్నేహితుల ప్రభావానికి లోను కాకూడదు,విద్యార్థులు ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం విద్యలో మంచి ఫలితాలు సాధించడానికి వ్యక్తిత్వ వికాసం మరియు ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి కుటుంబం మరియు సమాజంలో గౌరవం ఉండాలన్నారు. శక్తి యాప్ నెంబర్ 7993485111 ఫోన్ చేసి మీ గ్రామంలో బాల్యవిహాలు చిన్నపిల్లలపై నేరాలు జరిగినచో 1098 ఫిర్యాదు చేయాలి. పోక్స్ కేసులపై అవగాహన కల్పించి ఉమెన్ వెల్ఫేర్ హెల్పర్ 181 ఎమర్జెన్సీ 100 112 లకు కాల్ చేయాలని కోరారు. సమాచారం అందిన వెంటనే పోలీస్ సిబ్బంది చట్టపరమైన చర్యలు తీసుకుంటారని తెలియజేశారు. పోలీస్ శాఖ ఎప్పుడు అండగా ఉంటుందని భయం విడిసి ఏ సమస్య ఫిర్యాది చేయాలని ఎస్ఐ కె. మల్లికార్జున తెలిపారు.



# వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ పై అవగాహన సదస్సు




గోకవరం, జూన్ 18పల్లె వెలుగు :తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం పెంటపల్లి గ్రామంలో ఉద్యాన శాఖ మరియు పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. తక్కువ శ్రమతో ఎక్కువ ఆదాయం పొందే మార్గాలపై నిపుణులు రైతులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పతంజలి ఫుడ్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఏ ఎస్ ప్రకాష్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ తోటల ప్రాముఖ్యత, కంపెనీ ద్వారా రైతులకు అందుతున్న సేవలు, ఎరువుల యాజమాన్యం మరియు సులభతరమైన సాగు మెళకువల గురించి వివరించారు. ఉద్యాన శాఖ అధికారి పి.రిని మాట్లాడుతూ గ్రామంలో వరి సాగు ఎక్కువగా ఉందని, నీటి వసతి ఉన్న భూములను ఆయిల్ పామ్‌కు మార్చుకోవడం వల్ల అధిక దిగుబడితో పాటు ఆర్థికంగా లాభసాటిగా ఉంటుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలు, సూక్ష్మ సేద్యం, డ్రిప్ ద్వారా ఎరువుల వినియోగం మరియు అంతర పంటల సాగు వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పతంజలి ఫుడ్స్ సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ డి ఎస్ శ్రీనివాస్, ఫీల్డ్ ఆఫీసర్, కంపెనీ సిబ్బంది, వీహెచ్‌ఏ మరియు పెద్ద సంఖ్యలో పామ్ ఆయిల్ రైతులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చొరవతో యల్లమిల్లిలో తాగునీటి సమస్య పరిష్కారం



గండేపల్లి, జూన్ 18 పల్లె వెలుగు : కాకినాడ జిల్లా గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామంలో ఐదేళ్లుగా నిరుపయోగంగా ఉన్న తాగునీటి బోరును ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పునరుద్ధరించారు. గ్రామ చెరువు గట్టుపై ఉన్న బోరు పనిచేయక స్థానికులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రామ టీడీపీ అధ్యక్షుడు సుంకవిల్లి వీర వెంకట సత్యనారాయణ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత ఆర్డబ్ల్యూఎస్ మరియు విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు బోరుకు అవసరమైన కరెంటు కనెక్షన్ కల్పించి, మోటారును బిగించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దిపూడి వీర వెంకట సత్యనారాయణ, దేవిశెట్టి బాబ్జి, చీకట్ల నాగరాజు, నీటి సంఘం వైస్ చైర్మన్ బోట్ల బోరయ్య, ఆర్డబ్ల్యూఎస్ మరియు విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు

# సీనియర్ జర్నలిస్ట్ కొండేపూడి సత్యనారాయణకు ఘన నివాళి



కాట్రేనికోన, జూన్ 18 పల్లె వెలుగు : అమలాపురం విశాలాంధ్ర స్టాఫ్ రిపోర్టర్ గా పనిచేసి ఇటీవల మరణించిన సీనియర్ జర్నలిస్ట్ కొండేపూడి సత్యనారాయణ సంస్మరణ సభ గురువారం కాట్రేనికోన గ్రామ సచివాలయం వద్ద నిర్వహించారు. సత్యనారాయణ చిత్రపటానికి పలువురు జర్నలిస్టులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాట్రేనికోన మండల ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్ మట్టపర్తి రవీంద్రనాథ్ మాట్లాడుతూ, కొండేపూడి సత్యనారాయణ సుమారు 45 సంవత్సరాల పాటు జర్నలిస్టుగా ఎన్నో ప్రజా సమస్యలపై పోరాటం చేసి వాస్తవాలను వెలుగులోకి తెచ్చారని కొనియాడారు. ఆయన మరణం పత్రికా రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. పేదలకు, సామాన్యులకు ఏ ఆపద వచ్చినా వెనుకాడకుండా సంబంధిత అధికారుల వద్దకు తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించడంలో ఆయన ముందుండేవారని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అయితాబత్తుల శీనుబాబు, గోనెమడతల బ్రహ్మాజీ, మట్టపర్తి రవి, కాశి సురేష్, గంటి బోస్, కొంకి రవి, జగడం శ్రీనివాస్, కముజు సుందరయ్య, బడుగు శ్రీనివాస్, కాశి చక్రిత తదితరులు పాల్గొన్నారు

# కూటమి పాలన విజయోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

జగ్గంపేట, జూన్ 18 పల్లె వెలుగు జగ్గంపేట రావులమ్మ నగర్ లోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూన్ 21న ఆదివారం పరిణయ ఫంక్షన్ హాల్‌లో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన విజయోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరు కావాలని సూచించారు. జూన్ 25 నుండి 45 రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించి, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. జూన్ 14 నుండి జరుగుతున్న ఓటర్ల నమోదు ప్రక్రియలో బీఎల్ఏలు, క్లస్టర్, బూత్, యూనిట్ ఇంచార్జ్‌లు చురుకుగా పాల్గొని ఓటర్లకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. రానున్న నాలుగు నెలల్లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం ఎమ్మెల్యే 80 కార్లతో ర్యాలీగా కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి విజయోత్సవ వేడుకలకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో అడపా భరత్, ఎస్ వి ఎస్ అప్పలరాజు, కందుల చిట్టిబాబు, అడబాల భాస్కరరావు, ఉంగరాల రాము, పైడిపాల సూరిబాబు, తోట రవి, తోట గాంధీ, పాలచర్ల నాగేంద్ర చౌదరి, జంపన సీతారామచంద్ర వర్మ, దాసరి తమన్నా దొర తదితరులు పాల్గొన్నారు



Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com